పెద్ద కథ

* శిశిరవసంతాలు *

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

:వసంతం:

ఈ ఇరవయ్యో శతాబ్దపు మొదటి దశాబ్దపు చివరి సంవత్సరాది. గోదావరీ కృష్ణలంత గొప్పనది కాకపోయినా, వేసవికాలంలో కూడా నీటికి లోటులేని ఒక చిన్న నది. దాని సమీపంలో ఒక తోట—సపోటా జామ మొదలయిన ఇతర జాతుల చెట్లు కూడా లేకపోలేదు గాని, ఎక్కువగా ఉన్నవి మామిడిచెట్లు కాబట్టి మామిడితోట అన వచ్చును. చుట్టూ జీడిమామిడి చెట్లున్నాయి; వాటికి వెలుపలగా కంచె ఉంది. కాని, దానిగుండా దారులు కూడా చాలానే ఉన్నాయి.

తోటలో ఒకమూలగా పెద్దమామిడి చెట్టొకటుంది. అది పళ్ళకంటె పిల్లలు కోతికొమ్మచ్చి ఆడుకోందికే ఎక్కువగా ఉపయోగపడుతూంది. ఆ చెట్టుకి భూమికి సమాంతరంగా చాలాదూరం సాగిపోయే కొమ్మ ఒకటి ఉంది. ఆ కొమ్మమీద నేలను పరుగెత్తినంత జోరుగానూ పరుగెత్తగలరు ఆటలాడుకొనే కుఱ్ఱవాళ్లు—తోటంతా నిర్మానుష్యంగా ఉంది, ఆ కొమ్మమీద కూర్చొని ఏమిటో తీవ్రంగా చర్చిస్తున్న ఇద్దరు కుఱ్ఱవాళ్ళను తప్పిస్తే.

"ఏమిరా కృష్ణా! ఇవాళ పండుగరోజు కూడా కదా, ఎందుకు సరదాగా లేవు?"

"ఏమిటో(రా యాజులూ! నాకేమిటో చాలా చికాగ్గా ఉందిరా!"

"నువ్వే ఇలా అంటే మరి మామాటేమిటంటావురా కృష్ణా! మీ అమ్మ నిన్నేమీ అనదు; మీ మామయ్యయినా ఎప్పుడేనా కేకలు వేస్తాడుతప్ప నిన్ను కొట్టడు. మాకయితే ఎప్పుడో ఒకనాడు తప్ప రోజూ తాళాధ్యయం అవుతూనే ఉంటుంది; ఇక మన కుఱ్ఱజట్టంతా నీమాట కాదనరు."

"అదికాదురా యాజులూ! నాకసలు ఈ ఊళ్లో ఉండడమే ఇష్టంలేదురా!"

"నాకూ ఇష్టంలేదు రోజూ పెద్దవాళ్లచేత దెబ్బలూ తిట్లూ తింటూఉండడం. కాని మరేం చెయ్యగలం? తప్పదు."

"ఏం, ఎందుకు తప్పదు? ఎక్కడికయినా పారిపోతాము. ఆ తరవాత...

"అసలు ఎలా పారిపోతాముర! పారిపోతే మటుకు మనవాళ్లు వెతికించి పట్టుకోరా? అసలు రైలెక్కడానికి టిక్కట్టుండాలి, దానికి ఎంతో డబ్బవుతుందిట."

"అదంతా నాకు తెలుసునురా! మనకి ధైర్యం అంటూ ఉండాలిగాని డబ్బులేకపోయినా బాధ లేదు."

"నీమాట కాదననుగాని కృష్ణా! చూశా, మనం ఎలాగోలాగు పారిపోతామనుకో! ఆ తరవాత చేసేదేమిటి? అక్కడ మనకు అన్నం ఎవడు పెడతాడు? ఇక్కడ మనవాళ్లు ఎంత తిట్టినా మూడుపూటలా అన్నం పెడతారు."

"ఎప్పుడో పెళ్ళిళ్ళకి తప్ప పైఊరు వెళ్ళలేదు గనక నీకు ఊళ్ళో తప్ప మరెక్కడా ఎవ్వరూ బ్రతకడం లేదనిపిస్తుంది. అక్కడ పట్నంలో, మా నాన్నగారు బ్రతికిఉన్నప్పుడు మా యింటికి ప్రతి ఆదివారం సుబ్రహ్మణ్యం అని ఒక కుఱ్ఱవాడు భోజనానికి వచ్చేవాడు. వాడికి అప్పుడు పన్నెండు పదమూడేళ్ళకంటె ఎక్కువ ఉండవు. వాళ్ళమ్మా నాన్నా చిన్నప్పుడే చచ్చిపోయేరట! మరెవళ్ళూ బంధువులుకూడా లేరట. ఒక్కడూ పట్నంలో ఉండి వారాలుచేసుకొంటూ చదువుకొనేవాడు. ఈపాటికి చాలా పెద్ద చదువులోకి వెళ్ళిఉంటాడు."

"అయితే మరి పట్నంలో పెద్దవాళ్ళ పూచీ లేకుండా మనం ఇంగ్లీషుచదువు చదువుకోవచ్చునన్నమాట! ఏమో నాకు భయంగా ఉందిసుమా! ఇక్కడ మనం ఏదో చదువుకొంటున్నాముకదూ?"

"ఈ సంస్కృతంచదువు నాకేమీ ఇష్టం లేదుసుమా! అందులో మా మామయ్య మూడునాలుగు రోజులు ఏ చదువూ లేనట్టే తన పనులమీద తాను తిరుగుతాడు. ఏదో ఒకనాడు తనకేపనీ లేనినాడు పట్టుకొని పాతశ్లోకాలన్నీ అప్పజెప్పమంటాడు. ఎంత బాగా చెప్పినా ఇంకా ఏవో తప్పులున్నాయనే అంటాడు. చెప్పినప్పుడు తనకి ఎక్కడలేని తొందరాగాని ప్రశ్నలడిగినప్పుడుమాత్రం తప్పులు పట్టడానికే చూస్తాడు."

"ఇంకా నయం, నువ్వు తెలివయినవాడివి. నీకు ఒక్కమారు చదివితే వచ్చేస్తుంది. నీమీద ఎప్పుడయినా కేకలు వేస్తాడుగాని కొట్టడు; మాకయితే ఇంట్లోనూ దెబ్బలే, పాఠశాలలోనూ దెబ్బలే."

"అన్ని దెబ్బలూ తిట్లూ తింటూనంటావుగాని ఇక్కడనుంచి మరెక్కడికయినా పోయి హాయిగా ఇంగ్లీషు చదువుకుందామంటే నీకిష్టంలేదుకదా!"

"ఇష్టంలేక కాదురా కృష్ణా! భయం! మనవాళ్ళూరుకుంటారా? దొరికిపోయేమంటే ఆ తరవాత ఇప్పటిలాగ తిరగనివ్వరుకూడా. ఎప్పుడూ మనమీద ఒకకన్ను వేసేఉంచుతారు."

"నీ యిష్టం. నేనుమటుకు ఇక్కడ మరి ఉండదలుచుకోలేదు. అప్పుడు మా నాన్నగారు పోయాక మా మామయ్య మాటలు విని మా అమ్మ ఇక్కడికి వచ్చేసిందిగాని నాకేమీ ఇష్టంలేదు. మా అమ్మ ఇక్కడి మామిడితోటలగురించి పొలాలగురించీ ఎంతో ఇదిగా చెప్తే, సరదాగానే ఉండేది కాని, ఆ ఊరు విడిచిరావాలని లేకపోయింది. మొన్న మా మామయ్య మా అమ్మతో అంటూంటే విన్నాను. అక్కడ మా యిల్లు అమ్మేసి, ఇక్కడ భూమి కొనేస్తాడట."

"అవున్రా, నేనూ విన్నాను, మీ మామయ్య సుబ్బారాయుడుగారి భూమి కొనటానికి బేరం చేస్తున్నాడట."

"ఈ ఊరు రాగానే కృష్ణమూర్తిఅని చక్కగా ఉన్న పేరుని మార్చి కృష్ణశాస్త్రి అని పెడతానన్నాడు మా మామయ్య. మా అమ్మ కాదంటే కృష్ణమూర్తిశాస్త్రి అని మార్చేడు. చొక్కాలు లాగూలు తొడుక్కుంటే బాగుండదట. గావంచాలు కట్టుకోమంటాడు. వచ్చే ఏడు వాళ్ళ కామాక్షికీ నాకూ పెళ్ళి చేస్తాడట. నాకు కామాక్షంటే అసహ్యం, పెద్ద పళ్లూ అదీని, ప్రతిదానికీ బారుమని ఏడుస్తూ ఉంటుంది. అంతకంటె చిన్నదయినా మీ సరస్వతి ఎంతో బావుంటుంది. చక్కగా మాట్లాడుతుంది. ఏదయినా చెప్తే వింటుంది. అంతేగాని ఎవరి చేతిలో ఏది కనిపించినా తనకే కావాలనడమూ, అమ్మా చూడే అని ఫిర్యాదు చెయ్యడమూ అదేమీ లేదు కామాక్షిలాగ!"

"మా సరస్వతికీ అప్పుడే పెళ్ళిమాటలవుతున్నాయి. మొన్నను ఆమధ్యను అంతా నిశ్చయమయిపోయిందనుకొన్నారు. మళ్ళీ ఎంచేతో, వాళ్ళు మొదట ఒప్పుకొన్నకంటె తక్కువ డబ్బిస్తామన్నారు కాబోలు, తప్పిపోయింది. అసలు మా పెద్దనాన్న ఉద్దేశం మా సరస్వతి పెళ్ళితోటే నా పెళ్ళి కూడా చేసెయ్యాలని."

"అంతేన్రా, ఇక్కడిలా ఉంటే, మనకి దెబ్బల పెళ్ళి తప్పదు; నిజం పెళ్ళీ తప్పదు."

"దెబ్బల పెళ్ళంటే భయం గాని, అసలు పెళ్ళికేవిఁరా బాజాభజంత్రీలు వస్తాయి; పల్లకీలో ఊరేగిస్తారు; కొత్త బట్టలు వస్తాయి; ఇంట్లో పెళ్ళి అవుతుందంటే ముందు నెల్లాళ్ళూ తరవాత కొన్నాళ్ళపాటూ పెద్దవాళ్ళు మన చదువు ఊసు ఎత్తరు. హాయిగా తిరగొచ్చును."

"నీ మొహం పెళ్ళంటే అంతే అనుకొన్నావేమిటి?"

"అంతే కాదురా, పెళ్ళాం వస్తుంది. పెళ్ళికూతురంటారే, అదే పెళ్ళాం. పెళ్లాన్ని మొగుడు తిట్టినా, కొట్టినా ఏంచేసినా ఎవ్వళ్ళూ ఏమీ అనరు; అసలు పెళ్లామే మొగుడు ఏం చేసినా మారుమాటాడకూడదట. ఇంకా పెద్దపండుగలకి అత్తారింటికి వెళ్లొచ్చును. అత్తారింట్లో అల్లుడికి ఎంతో మర్యాద చేస్తారు; మా చిన్నబావ వచ్చేడంటే పట్నంనించి ప్లీడరుగారు వచ్చినప్పుడు చేసినంత మర్యాదా చేస్తారు."

"అది కాదురా, చిన్నతనంలో పెళ్లి చేసుకోడం మంచిది కాదుట, మా నాన్న మా అమ్మతో అంటూఉండేవారు. చిన్నప్పుడే పెళ్ళి చేసుకొంటే చదువు బాగా రాదట!"

"నామటుకు ఈ చదువు మానేస్తేనే బాగుండేట్టుంది సుమా!"

"మరయితే ఇంగ్లీషు చదువుకోవాలని లేదూ?"

"ఉంది కాని, ఎలాగ? మా వాళ్లు పంపరు. దొంగతనంగా పారిపోయి, దొరికిపోయేమంటే చంపేస్తారు."

"అసలు నీకు నిజంగా రావాలని లేదు. ఉంటే ఇన్ని అనుమానాలెందుకు? తరవాత సంగతి అటు నించి నరుక్కురమ్మన్నాడు. ఈ రాత్రే మనం బయలుదేరిపోవాలి. నేను మీయింటిదగ్గర పడుకొందికని చెప్పివస్తాను. ఇద్దరం వీధి అరుగుమీద పడుక్కున్నట్టే పడుక్కుని, అందరూ నిద్ర పోగానే బయలుదేరేమంటే రెండుగంటల్లో స్టేషనుకి వెళ్లిపోగలము. రాత్రి బండీ ఎక్కిపోయి, మీద బల్లమీదికి ఎక్కి పడుక్కున్నామంటే తెల్లవారేదాకా అడిగేవాడుండడు.

"రైల్లో టిక్కట్లుచూసే ఇనస్పెక్టరుండడురా"

"ఉంటాళ్లేగాని రాత్రంతా వాడికిదేపనా? అయినా కావాలంటే మనం ఈ పక్క స్టేషనుకే టిక్కట్టు కొనుక్కుంటాము. అదంతా నీకెందుకు? నీకే భయంలేకుండా చూసే పూచీ నాది. ఏం, ఇష్టమేనా? ఏమంటావు?"

"రాత్రి భోజనమయాక నువ్వు మాయింటికి వస్తావుకదూ!"

వస్తాన్లేగాని, నువ్వు వచ్చేమాటైతే, నీపక్కలోనే మరొకచొక్కా లాగూ గావంచా ఉంచుకో. చొక్కా లాగూమీదే మరొకజత తొడిగేసుకొన్నామంటే ఇవి ఉతుక్కుంటే అవి కట్టుకొందికి అవి ఉతుక్కుంటే ఇవి కట్టుకొందికి పనికొస్తాయి. గావంచాఉంటే ఎక్కడపడితే అక్కడ హాయిగా స్నానం చెయ్యొచ్చును.

"మరయితే చీకటి పడుతున్నట్టున్నాది; ఇళ్లకు పోదామా?"

"సరే, పద, కాని, జ్ఞాపకం ఉందికదూ!"

* * * *

ఒక నిమిషంకంటె ఎక్కువగా రైలాగని చిన్న స్టేషను. ఆ ఆగిన ఒక్క నిమిషంకూడా అనవసరమే అనిపిస్తుం దప్పుడప్పుడు. ఎక్కేవారుగాని దిగేవారుగాని పగటిబండికే క్వచిత్కంగా ఉంటారు. రాత్రి బండిలో మనుష్యులు దిగడమన్నా, టిక్కట్లు చెల్లడమన్నా పెద్ద విశేషమే. నాటిరాత్రి సర్వసన్నాహాలూ చేసుకొని వచ్చిన ఇద్దరు బాల ప్రయాణికులు లేకపోలేదు. కాని, స్టేషనులెక్కల్లో వారు ప్రయాణికులు కారు. అంతేకాదు, ఆ ఉన్నపాటి స్టేషను ఆవరణాన్ని వారు వినియోగించుకోలేదు. స్టేషనుకి దగ్గరలో ఎవరిదో పాడుబడిన ఇల్లొకటి ఉంది. ఆ యింటి అరుగే వారి వెయిటింగు రూము.

రైలు, చాలాదూరంలో ఉండగానే వెలుగు కనిపించింది. "లేరాకృష్ణా! నిద్దరపోతున్నావేమిటి?" అన్నాడు సోమయాజులు.

"నిద్దర లేదురా, ఇంకా ఎక్కడ అది వచ్చేసరికి చాలాసేపు పడుతుందిలే. నువ్వేమీ గాభరా పడకు."

స్టేషనుకి అవతలి తట్టునుండి వెతకడం ప్రారంభించారు. ఒక పెట్టెకి గడియవచ్చింది కాదు. ఇంకొకదానికీ రాలేదు. కృష్ణమూర్తి తలుపుకి ప్రక్కనుండే గజం పట్టుకొని ఎక్కి కిటికీలోనుంచి లోపలికి దూకి, "ఎక్కురా గబగబ. రైలు కదిలిపోతుంది" అన్నాడు.

కిందనుండి యాజులు "నాకేమో భయంగా ఉందిరా" అన్నాడు.

"ఏం భయంలేదు. నే నెక్కినట్టే ఎక్కరా నా చెయ్యి అందిస్తాను"

"అదికాదురా; అసలు ఇంట్లో ఏమంటారో అని"

"మరయితే ఇంటిదగ్గరే ఉండక ఇక్కడిదాకా ఎందుకొచ్చావు?"

"తోటలోంచీ గోర్జిలోంచీ నీకొక్కడికీ రావడానికి భయంకదా అని, ఇంద. ఈ దుప్పటీ గావంచా, ఈ చొక్కా లాగూ కూడా తీసుకో, భయంలేదు. మా చాకలిది పారేసిందనుకొంటారు. రైలుకూసింది. ఇంద. మా చెల్లి సరస్వతికి మా పెద్దత్తయ్య ఎవ్వళ్లకీ తెలియకుండా ఇచ్చిందిట. మనకని ఇచ్చింది, రెండు రూపాయలు. మరి నేనుంటాను. మళ్ళీ నువ్వెప్పుడొస్తావో? మరిచిపోకు—"

* * *

ఎనిమిదిమార్లు ఋతుచక్రం పరిభ్రమించింది. వైశాఖమాసం, లెక్కకు వసంతర్తువయినా గ్రీష్మపు ప్రభావమే ఎక్కువగా కనిపిస్తూంది.

ఏరు సన్నని పాయగా ప్రవహిస్తూంది—

తోట ఎప్పటిలాగే ఉంది. కాకపోతే కొన్ని మరీ ముసలిచెట్లు కర్రలకుగాను కొట్టివేయబడ్డాయి.

అక్కడక్కడ కొన్ని అంటుమామిడిచెట్లు తలలెత్తేయి. కాని, మూలగా ఉన్న పెద్ద మామిడిచెట్టు, భూమికి సమాంతరంగా సాగిన దాని కొమ్మ అలాగే ఉన్నాయి. ఆ చెట్టు అలా ఉండడమే, తోటలో ఏ మార్పూ లేదనిపించేలా చేస్తుందేమో.

సూర్యుడి వాలు కిరణాలుకూడా వేడిగానే ఉన్నాయి. అయితే చెట్టునీడని మాత్రం చాలా హాయిగా ఉంది. ఎండలో నడిచివచ్చిన శ్రమ నంతటినీ మరిపించేలా వీస్తుంది చల్లనిగాలి.

ఆనాటి ఇద్దరు మిత్రులే ఈనాడూ మళ్ళీ కూర్చున్నారు. అయితే వాళ్ళతోపాటు దగ్గరలో ఒక పదిహేరేళ్ళ కుర్రవాడొకడున్నాడు, తాటికాయలు కొట్టి అందిస్తూ—

కట్టుకొన్న పొట్టిచేతుల చొక్కా, సన్నని పంచా—ఆ రెండే కాదు — పాపిడి తీసి దువ్విన క్రాపింగు, కొత్తగా వస్తూన్న మీసమూ ఇవన్నీ కృష్ణమూర్తిలో పట్నవాసపు వాసనని సూచిస్తున్నాయి.

నేడు కాకపోయినా మరి పదేళ్లనాటికయినా యజ్ఞంచేసి పుట్టు సోమయాజులు కాదు, పెట్టు సోమయాజులు కావడానికి తగినట్టుగానే ఉన్నాది సోమయాజులు వేషం.

సోమయాజులు రెండేసి కాయలు తినేసరికి ఒక్కొక్క కాయకూడా తినలేకపోతున్నాడు కృష్ణమూర్తి. సోమయాజులన్నాడు. "ఇంతేరా, మీ పట్నంవాళ్ళు తిక్కనవాట్లో మమ్మల్ని వెనక్కినెట్టేస్తారుగాని తిండికిమాత్రం మాతో పనికిరారు" అన్నాడు.

కృష్ణమూర్తి అన్నాడు: ఈ తాటికాయలు తినడానికి నేర్పుకావాలి; దానికీ అలవాటుండాలి; మరి పదిరోజులు పోయాక చూడు నువ్వు నాతో సమానంగా తినగలవేమో? అంతెందుకు, నీ కనుమానంగా ఉంటే పందెంవెయ్యి, మనిద్దరిలో ఎవళ్ళెక్కువ లడ్డూలు—ఇక్కడ మనవాళ్లు సరిగా చెయ్యలేరు కాబోలు—బూరెలయినా సరే, ఎవళ్ళెక్కువ తింటారో?"

"నువ్వూ ఒకమాదిరిగా తింటావేమోగాని నాతో సమానంగా తినగలవా?"

"అదే గమ్మత్తు, ఒకమారిలాగే ఇరవై లడ్డులు తినడానికి పందెం వేసి అయిదురూపాయిలు గెల్చేను. మామూలుగా ఎక్కువగా తినాలని ఉండదు. కాని, మొండికెత్తి కూర్చున్నాక ఎన్నయినా తినొచ్చును."

"తినడమంటే జ్ఞాపకం వచ్చింది. మా సరస్వతి వాళ్ళ అత్తారిఊళ్ళో వెంకన్నగారని ఒకతను ఉన్నాడు. మనిషికూడా మంచి ఆజానుబాహువే. సంతర్పణ భోజనం అంటే అతనికి అధమం ఒక వంద బూరెలు కేటాయించవలసిందే. తద్దినానికి పిలిచినా అంతే, వంద గారెలకి లోటులేదు. కాని, మనిషి మంచివాడు, ఎవళ్ళో దగ్గర కూర్చొని తినాలని బలవంతం చేస్తే తప్ప, ఒకమారు వడ్డించినవాటితోనే చాలినట్టు లేచిపోతాడు. ఇక, ఊళ్లో ఎవరికి ఏ సాయం కావలసివచ్చినా కాదనడు. వాళ్ల ఊరుకీ స్టేషనుకీ పదిమైళ్లపైగా ఉంటుంది. దారికూడా అంత మంచిది కాదు. రాత్రి పూన్చినబండి తెల్లవారు జాముకిగాని చేరుకోదు. ఉపయోగాన్నే రైలు. అయితే, బండి వెనకాతల కర్రపట్టుకొని వెంకన్నగారు నడుస్తున్నాడంటే మరి దొంగభయం లేదన్నమాటే...

"అయితే అప్పుడు నేను వెళ్ళిపోయిన తర్వాత ఎన్నాళ్లకయేయి మీ పెళ్ళిళ్ళు?"

"నువ్వెళ్లిపోయేక మరొక పదినెల్లకే అయేయి."

"అంటే ఇప్పటికి ఏడేళ్ళన్నమాట? నీ కొడుకూ కూతురూ బాగున్నారు. నువ్వు చదువుకోకపోయినా నీ పిల్లలనయినా చదివిస్తావా? అంటే నా ఉద్దేశం ఇంగ్లీషు చదువు."

"ఇంకా ఏదీ వాళ్లు పసివెధవలు. ఏదో భగవంతుడి దయవల్ల వాళ్లు బ్రతికి బాగుండి పెద్దవాళ్లయితే అప్పటి మాటకదా! చదివించాలంటేమాత్రం, మనకి చిన్నతనంలో తెలియదుగాని, ఎంత శ్రమతో కూడుకొన్నపని, దానికి బోలెడు డబ్బుండాలి."

"ఉంటే డబ్బు ఖర్చుపెట్టుకొంటామంటే వద్దనదుగాని, డబ్బేమో ఎంతో అయిపోతుందనుకోకు. అసలు నా చదువుకి డబ్బెవడిచ్చాడు?"

"బాగుందిరా! అందరికీ నీ అంతటి తెలివితేటలూ పట్టుదలా ఉంటాయా? నువ్వుగనక మొదట్లో ఎన్ని ఇబ్బందులు పడినా కొసకి నెగ్గుకొచ్చేవు. అప్పుడు నేను నీతో బయలుదేరలేదుగాని, బయలుదేరినా వారం పదిరోజులకి బెంగపెట్టుకొని ఇంటిముఖం పట్టేవాణ్ణి అందుమూలంగా నీకూ చికాకు కలిగిఉండేది."

"ఏమో ఎందుకలా అనుకోవాలీ? నువ్వూ నాలాగే కాదు, నాకంటె బాగా చదువుకొని ఉండే వాడివేమో!

"ఉఁహుఁ లేదురా, నాసంగతి నాకు తెలీదూ? కాకపోతే నువ్వు మొదట్లో ప్రవేశించానన్నావు చూడు, పూటకూళ్ళింట్లో వడ్డనపనికి. నేను ఆ పనిలో శాశ్వతంగా కుదురుకొని ఉండేవాణ్ణి; మహా అయితే కొన్నాళ్ళకి వంటవాడుగా కూడా తయారవ గలిగే వాణ్ణి."

"అసలు నీకు ఇంగ్లీషు చదువుమీద, పట్నం బ్రతుకుమీదా మనసులోంచీ నిజంగా ఇష్టంలేదు. పోనీలే, నీ కిది బాగానేఉంది. నువ్వొక్కడివే పెళ్ళిళ్ళు చేయించేస్తున్నావుట? డబ్బుకూడా చాలా ఆర్జించేవట?"

"నువ్వంటే పెద్ద మెట్రికులేషను చదువుకొన్నావు గనక నెలకి ఏ యాభయ్యో వందో జీతం తేగలవుగాని, నాదీ ఒక ఆర్జనే? ఏదోకాలంలో సరిగా వర్షాలు పడి ఒక సంవత్సరం బాగా పండిందంటే మరి రెండేళ్ళపాటు పండకపోయినా బాధలేదనేపాటి గ్రాసం వస్తుంది. బట్టలకికూడా మా కిక్కడ ఎలాటివి కట్టుకొన్నా సరిపోతుంది. ఉప్పూ, దీపం పెట్టుకోందికి కిరసనాయిలూ తప్ప మరేమీ కొనుక్కో అక్కర్లేదు. అంచేత, పెళ్ళిళ్ళు పేరంటాలు చేయించిన బాపతు, మా పెద్దనాన్నగారు మంచంపట్టిన తరవాత కొన్నాళ్ళు నాచేత నలుగురికీ, మందు లిప్పించేరు—ఆయన పోయినవెనక అదీ మనపరమే అయింది. అంతా ఇప్పటికి, ఈ సంగతి నాకూ నా భార్యకీ తప్ప, మా యింట్లో మరెవ్వళ్ళకీ కూడా తెలియదు, ఎనిమిదివందల యాభైరూపాయిలయింది. మరొక్క ఏడాదిలో వెయ్యి పూర్తికావాలి. నే నంటాను, పొలం కొందాముని. నా భార్య అంటుంది, కరణంగారిల్లులాగ ఎత్తుగా పెంకుటిల్లు కట్టుకొందాం, ముందు మిద్దెపడిపోతూ పడిపోతూ ఉంది" అని—నువ్వేమంటావు?"

"రెండూ మంచిపనులే. అయితే పొలంఅంటే దానికి మరి అంతు ఉండదు. అంచేత ముందు చక్కటి ఇల్లు కట్టుకొని, తరవాత పొలాన్ని విస్తరింపజెయ్యొచ్చును, ప్రస్తుతానికి ఎటువంటి లోపమూ లేదు గనక—

"బాగా చెప్పావురా!"

"నీ పని బాగానే ఉంది. చక్కగా రోజంతా ఏదో నీకు సరదా అయిన పని చేస్తున్నావు; ఊళ్ళో పెద్దమనిషి వనిపించుకొంటున్నావు; అంతో ఇంతో ఆర్జించుకొంటున్నావు. మీ సరస్వతి సంగతే నాకు విచారంగా ఉంది. రెండవ పెళ్ళివాడి కిచ్చేరా?"

"రెండవ పెళ్ళి ఏమిట్రా మూడవ పెళ్ళే. ఆ మొదటి సంబంధం కూతుళ్లూ కొడుకులూ దీనికంటె పెద్దవాళ్లు. రెండవ సంబంధానికి ఒక కూతురు. మూడవది ఇది, దీని కింకా పిల్లలు లేరు. అతగాడికి జలోదరం. మహా అయితే మరొకటి రెండేళ్ళకంటె ఎక్కువ జీవించడం కష్టం."

"అయితే మీవాళ్లు చూస్తూజూస్తూ అంత ముసలాడికి ఎలా కట్టబెట్టేర్రా?"

"ఏం చెయ్యమన్నావు? అదంతా మా పెదనాన్న చేసిన నిర్వాహకం. ఆయన ఉద్దేశం కుటుంబానికి లాభం చెయ్యడమే ననుకో. అవతలి వాళ్ళ ఆస్తినీ, మా కియ్యబోయే వెయ్యి రూపాయిలనే చూశాడు గాని, మరేమీ చూళ్లేదు. మీ మామయ్య కూడా తక్కువ తిన్నవాడు కాదు. తనకి బోలెడు ఆస్తి ఉండగా తన కూతురు కామాక్షిని ఒక రెండవ పెళ్ళివాడి కిచ్చి పెళ్ళిచేసేడు. లెక్కకేమో రెండవ పెళ్ళివాడు గాని, మా బావగారికంటె కూడా పెద్దవాడు. కాని మీ మామయ్య అనుకొన్నట్టె అయింది. పెళ్లయిన ఒక్క కూతుర్నీ అత్తారింటికి పోయింది. కామాక్షికి ఒక కొడుకుకూడా పుట్టేడు. అతర్వాత కదా అతను పోయాడు. ఆ స్తంతా దక్కింది."

"ఆ డబ్బుగర్వానికి తోడు, మా మామయ్య పోవడంతో కామాక్షి కిప్పుడు పట్టపగ్గాలు లేకుండా ఉన్నాయి. దీవి పెత్తన అధికారం అంతా ఎప్పుడూ ఎవరి గోలా అక్కరలేని మా అమ్మమీద ఆరంభం అయింది. మరిక్కడ అట్టేకాలం మా అమ్మని ఉంచను. ఈమారు వెళ్ళగానే ఏదో ఉద్యోగంలో ప్రవేశించి మా అమ్మను తీసుకొని వెళ్లిపోతాను. నాకు గాని రావడానికి వీల్లేకపోతే, నీ పేర ఉత్తరం రాస్తాను; మా అమ్మను తీసుకొనివచ్చి దిగబెట్టేస్తావు కదూ; మరేం భయపడకు, రైలు ఖర్చులు నే నిచ్చేస్తాను."

"ఓస్! ఏమిట్రా! కావలసినవాళ్ళ దగ్గర డబ్బు మొగం చూసుకొంటా ననుకొన్నావా? నీకు గాని ఉద్యోగప్రయత్నానికి అవసరం ఉంటుందంటే ఏ యాభైయ్యో పట్టుకెళ్లు; మరొకళ్ళ ప్రాథేయం లేకుండా ఇవ్వగలను."

"నువ్విస్తానన్నదే పదివేలు. అంతగా అవసరం వస్తే అలాగే తీసుకొంటాను. అప్పుడు వెళ్లేటప్పుడు

మీ చెల్లెలు సరస్వతి ఇచ్చిందని ఇచ్చావే ఆ రెండు రూపాయిలూ ఎప్పుడో ప్రాణావసర సమయంలో గాని ఖర్చు పెట్టకూడదనుకొన్నాను. ఇంకా ఉన్నాయవి నాదగ్గర. అవి ఉండడంవల్ల ఎప్పుడూ డబ్బులేక పోడం అంటూ ఉండదు. చాలామార్లు అనుకొన్నాను! ఈమారీ రెండు రూపాయిల్లో అధమం ఒకటిఅయినా ఖర్చుపెట్టక తప్పదని. కాని, అంతలోకే ఏదో సాధనాంతరం కనిపించేది. ఇకముందు కూడా అలాగే ఎందుకు జరగకూడదూ? నువ్విస్తా నన్నదికూడా వాడుకోకుండా నే గడిచిపోతే ఎంత మంచిమాట!"

"ఓస్, నే నివ్వగలిగే దెంత? అయినా నువ్వు శేప్పొద్దున్న ఏతాసిల్దారో, మా జిస్ట్రీటో అయిపోయావంటే, అప్పుడు మేము దర్శనానికొస్తే ఎవరండీ, మీరు, ఏం పనిమీద వచ్చేరు, ఆఫీసుకే గాని, ఇంటికి రాకూడదని తెలియదూ అంటావు కాబోలు—"

"ఏమో! నా ముందు ముందు ఏమవుతుందో కాని, ముందు గుమాస్తాగా ప్రవేశించి పై అధికారులని మెప్పించుకొంటూ రావాలి, తరవాతిమాట దేముడెరుగును. మా మామయ్య ఇలా హఠాత్తుగా పోయి ఉండకపోతే ఇంకా పై చదువు చదివి ప్లీడరవాలనుకున్నాను. బాగా చల్లబడినట్టుంది; వెళ్ళి మొగం కడుక్కొని నీటికిదగ్గరగా ఇసకమీద కూర్చుందాము"

"అలాగే పద."

* * * *

ఏమండీ సోమయాజు లున్నాడా?

ఉన్నారు రండి కూర్చోండి.

ఎందుకులెండి. నే నొచ్చానని చెప్పండి.

రారా, కృష్ణా వీధిలో నిలబడ్డా వేమిటి?

నాకేం మీ యింటో మొగమాటం లేదు గాని, నీ కిప్పుడేం పెద్దపని లేదుకదూ! అలా తోటవేపు వెళదామా?

అలాగే కానీ పద.

....

అయితే ఏమిటి సంగతి?

సంగతికి ఏమీ లేదు, ఈ రాత్రిబండికే ప్రయాణం. నా పెట్టె పరుపు పట్టుకొందికి మనిషాకడు కావాలి.

సరే దానికేంలే గాని, ఇంకా మరొక నెల్లాళ్ళు పాటు ఉంటా నన్నావు?

నిజమే ఉంటా నన్నాను; కాని ఇప్పుడు వెళ్లిపోతా నంటున్నాను. అలా వచ్చింది పరిస్థితి.

ఇంతలో అంతమార్పు కేమిటి కారణం?

చెప్పడానికి నాకు చాలా మొగమాటంగా ఉంది. అయినా నీకుగనక చెప్తున్నాను; నీభార్యతో కూడా అనకూడదు.

అసలు ముఖ్యంగా దానితో నే అనకూడదు లే.

ఈమధ్యను కామాక్షి కాస్త ఒంటరిగా ఉన్న సమయం చూసుకొని, 'అయితే బావా! మీయింగ్లీషు చదువుకున్నవాళ్లు ఆడవాళ్లుకూడా మగాళ్లతో పాటు చదువుకోవాలంటారా అనీ, పెద్దవాళ్లయేక పెళ్లిళ్లు చేయాలంటారా అనీ, ఇంకా ధైర్యంచేసి అయితే వెధవాళ్ళు పెళ్ళి చేసుకోడంకూడా తప్పు లేదంటారా అనీ ఏవేవో ప్రశ్నలడగడం మొదలు పెట్టింది. నాకు దానితో మాట్లాడ్డం అట్టే ఇష్టం లేదు. కాని, అడిగినప్పుడు, అందులో సబబయిన ప్రశ్న అడిగినప్పుడు జవాబు చెప్పకుండా ఉండడమెలాగ? ఏవేవో నాకు తోచిన సమాధానాలు చెప్పేను. వితంతూద్వాహంగురించి వీరేశలింగంగారి వాదం సారాన్ని బోధపరచడానికి ప్రయత్నించేను. అంతే, ఏదో ప్రశ్నకి పరీక్షలో సమాధానం చెప్పినట్టుగా. అంతేకాని, నాకు మరొక ఆలోచనేలేదు.

నిన్న రాత్రినుంచి ఇంగ్లీషునవల ఒకటి చదువుతూ పడుకొన్నాను. అది చదువుతూండగా రెండుమూడు మార్లు వచ్చింది. మంచినీళ్ళు కావాలా అని అడగడానికీ, రాత్రంతా మరి నిద్రపోదలచుకోలేదా అనీ, అంతలా దీపం దగ్గరపెట్టుకు చదివితే కళ్ళకి జబ్బు చెయ్యదా అనీ అనడానికి. అప్పటిమట్టుకు నే నేవో సమాధానాలు చెప్పానుగాని నాకొస్ఫురణేలేదు; నా మనసంతా పుస్తకంమీద నే. రాత్రి ఒంటిగంట దాటిఉంటుంది నేను పుస్తకం మూసి పడుకొనే సరికి.

నాకు తెలివి వచ్చేసరికి ఒళ్లు వేడిగా ఉంది; ఆమె ఒళ్లు వెచ్చగా తగుల్తూంది...అంతా ఒక కలలా అయిపోయింది—నిజంగా కలే అని నన్ను నేను నమ్మించుకోవాలని చూసేను. కాని లాభంలేదు. ఇవాళఉదయం పళ్లుతోముకొందికి పుడకఇవ్వడం, మొగం కడుక్కొందికి నీళ్లివ్వడం, స్నానానికి నీళ్లు అమర్చడం అన్నిటిలోనూ ఏదో విశేషం కనిపించడమే కాదు, ఎవళ్లూ దగ్గరలేని సమయంచూసి, అదొక

మాదిరిగా చూసి చిన్న నవ్వునవ్వింది. ఆ నవ్వును తల్చుకొంటే నాకు జాలీ, కోపమూ రెండూ కలుగుతున్నాయి. పాపం దాన్ని చూసి జాలిపడవలసిందే, కాని, నన్ను ఎందుకు దిగలాగాలీ అని కోపం. చిన్నప్పుడంటే ఒకమాదిరి వికారంగా ఉండేదిగాని, ఇప్పుడు అవయవ పుష్టి లేకపోలేదు, అయినా ఏమిటో అదంటే నాకిష్టంలేదు. ఇక్కడుండి మరి తప్పించుకోలేను. అంచేతే ఈ ప్రయాణం. ఖర్చులకి ఒక పదిరూపాయి లివ్వాలిసుమా! రాత్రి రైలుకి నన్ను దిగబెట్టవూ?

అది నా విధి; ఖర్చులకా పది కాకపోతే పాతిక తీసుకో.

: గ్రీష్మం :

రాధా! అమ్మయ్య, నిద్రపోయావనుకొన్నాను. మేలుకొనే ఉన్నావు.

నాకు మధ్యాహ్నం నిద్రపట్టదని నీకు తెలియదు టే. ఇప్పుడు మధ్యాహ్నమే కాదు రాత్రికూడా నిద్రపట్టడంలేదు. రా! ముందు మంచినీళ్ళుతాగు, మజ్జిగ తెచ్చియిస్తాను. అబ్బ, ఈ ఎండలో ఎలా నడిచివచ్చేవే అంత దూరంనించి!

ఏం చెయ్యమన్నావు! ఇంకా నెల్లాళ్ళుంటావనుకొన్నానా! నిన్న మొన్నటిదాకా ఇక్కడ మావాళ్ళింట్లో పెళ్ళిగొడవ. ఇక హాయిగా ఉందామంటే అక్కడ మా అత్తారింట్లో పెళ్ళి నిశ్చయమయిందిట. ఆయన అప్పుడే మొన్ననే వచ్చి కూర్చున్నారు. ఇవాళ ఏదో పనుండి ఇక్కడికి దగ్గరే, వాళ్ళ స్నేహితుడిగారి ఊరు వెళ్ళేరు సైకిలుమీద. ఈరాత్రే ప్రయాణం. మొన్నటినించీ నీదగ్గరికి రావాలనుకుంటే ఇవాళకి వీలయింది. ఏమిటే అలా ఉన్నావు?

మరెలా ఉండమన్నావు చెప్పు. నీకు తెలుసును కదూ!

తెలియకేం—తెలిసింది. అంతా నాలుగురోజులయిందిట కదూ, పూర్తిగా ఏడాదిపాటు వేశారట జెయిలు. ఏమిటో, ఈ గాంధీగారు, మీటింగులు, సత్యాగ్రహాలు, దేశంలో మనుష్యులందర్నీ ఖయిదులో పెట్టించడమే మిగుల్తున్నాది.

ఆ ఖయిదుమాటకేం, తిట్టినవాళ్లు తిట్టినా మెచ్చుకొనేవాళ్లు మెచ్చుకోకపోరు. నాపని ఖయిదుకంటే అధ్వాన్నంగా ఉంది.

నిజమే నిజమే, కాని కొత్తగా మరేమయినా..

కొత్త ఏమీ లేదు, ఎప్పుడూ ఉన్నదే. నాకీ యింట్లో ఉండడం రోజొక యుగంగా ఉందంటే నమ్ము. మా అక్కయ్యకీ ఘోష ఏమీ తెలీదు. మా బావ మరి నన్ను వదలడు. ఈ మధ్యనల్లా ఇతను కృష్ణమూర్తి ఆశ ఉండేది. అతను స్పష్టంగా చెప్పేడు, ఈ నెలాఖరుకల్లా ఉద్యోగం అయినా కాకపోయినా సరే నన్ను పెళ్ళిచేసుకొంటానని. మా బావ ఉద్దేశం తను వేయించిన ఉద్యోగం గనక అతనూ అతని మూలంగా నేనూ తన చెప్పుచేతల్లో ఉంటామని. నేనూ, సరే ముందు, పెళ్ళికానీ, ఈ యింటినుండి తప్పించుకోవచ్చునుకదా, తరవాత సంగతి చూసుకోవచ్చుననుకున్నాను. వేళకి అంతా ఈవిధంగా రసాభాస అయింది.

అతను ఆవేళ పార్కులో మీటింగుకి వెళ్ళేటప్పుడు నువ్వు ఒద్దన లేకపోయావూ?

నాకు కనబడితేకదూ! అయినా ఆ వేడిలో, దేశం, స్వాతంత్ర్యం, దేశం స్వాతంత్ర్యం...ఇవే మాటలు.

పోనీలే, జరిగినదానికి ఇప్పుడు వగచి లాభం లేదు. అయితే అతను నిశ్చయంగా నీతో అన్నాడు కదా పెళ్ళి చేసుకొంటానని. అతను మాటతప్పే రకంకాదు. ఇన్నేళ్లు గడిపేవు, ఎలాగో వీధిని పడకుండా ఈ ఒక్క సంవత్సరం గడపలేవూ?

ఒక్క సంవత్సరం కాదు, మరొక్క నెలయినా అసాధ్యమే. నిజానికి మా బావదికూడా తప్పనలేను. మా అక్కది ఎన్నటికీ తగ్గనివ్యాధి. ఏదో వేగం అట్లో ఇట్లో తేలిపోతే బాగుండునని, అతనిబాధ. ఇప్పటికప్పుడే మూడేళ్లుపైగా అయింది. పైగా నేనొకతె నీయింట్లో దిక్కులేకుండా ఎందుకు పడి ఉండాలీ.

అదే ఏమీ అర్థంకాకుండా ఉంది. నీకు మహా ఉంటే నాకంటె ఒకటి రెండేళ్ళకంటె ఎక్కువ ఉండవు. మాకింకా అత్తవారిల్లు కొత్తగానే ఉంది. నీకింత చిన్నవయస్సులోనే పెళ్లి, సంసారం వైధవ్యం- అన్నీ సమకూడేయి. ఇంతకీ మన పెద్దవాళ్ళననాలి.

ఎవళ్లని ఏమన్నా లాభంలేదు. అందరూ కబుర్లు చెప్పేవాళ్లేగాని తీరా సమయం వచ్చేసరికి నిలబడే

వాళ్ళెవళ్ళు? మా యింట్లో వాళ్ళు ఒప్పుకోడం లేదని, మా నాన్న చచ్చిపోకముందు పెళ్ళి చెయ్యాలనీ ఏవో కారణాలు చెప్పి చిన్నపిల్లలకి పెళ్ళిళ్ళు చేసేవాళ్ళే. ఎవళ్ళైనా తెగించి పది రెండేళ్ళు ఉంచినా నలుగురూ నానామాటలూ అంటారు. అయినా నాకుమాత్రం మా మామయ్య అన్యాయం చేసేశాడనలేను. ఆయనకి పోయేసరికి ముప్పైఏళ్ళకంటె ఎక్కువలేవు; అంతా నాదురదృష్టం కాకపోతే ఎవరో ఏటిలో మునిగి పోతున్నారని ఈయనెందుకు వెళ్ళాలీ? వెళ్ళినా అదివరకెన్నిమార్లు ఎందర్ని నీటిప్రమాదంనించి తప్పించలేదు! అంతా నాదురదృష్టం! నన్ను చేసుకోడంనించి ఆయనకి పట్టుకొంది. పోనీ, మామయ్యేనా బ్రతికిఉండకూడదూ. ఊఁహుఁ, నాశని అందర్నీ పీడిస్తూంది. నన్ను చేసుకుంటాననడంవల్ల నేకాబోలు ఈయనకూడా హఠాత్తుగా ఖయిదులో పడవలసి వచ్చింది.

నువ్విలా ఏడుస్తే నాకు మరీకష్టంగా ఉంటుంది. ఖయిదులో పడడమంటే మరేమీ దొంగతనం చేసి పడడం కాదుకదూ! మా గోపాలం అన్నయ్య ఎంతో గొప్పగా చెప్పేడు అతనిగురించి. 'నాకీ ఉద్యోగం విడిచిపెట్టి దేశంకోసం త్యాగం చెయ్యడానికి ధైర్యం చాలిందికాదు.' నిజంగా కృష్ణమూర్తిలాటివాళ్ళు ఊరికి పదిమంది ఉంటే మనదేశానికి స్వాతంత్ర్యం ఆరునెల్లలో వస్తుందంటాడు. ఏలాగోలాగు, నువ్వీ ఒక్క ఏడూ ఓపికపట్టేవంటే అందరికంటె నువ్వే హాయిగా ఉంటావు. అతనిలాటివాడికి ఈ ఉద్యోగం కాకపోతే ఇంకొకటి దొరక్కపోదు, చదువు రూపం గుణం అన్నీ ఉన్నాయి

ఏమిటో నాకేం నమ్మకంలేదు. ఏదో అంటే మాత్రం ఏడాది తరవాత ఆమాట నిలబడుతుందా? నిలబడినా నామూలంగా అతనికికూడా నలుగురిలోనూ తలవంపులు. అంతకంటె, నేననే మనిషేలేకపోతే ఎవరికీ ఏయిబ్బందీ ఉండదు.

అదుగో అటువంటిమాటలంటేనే నాకిష్టంలేదు. ప్రపంచంలో మనకంటె హీనంగా ఉంటున్నవాళ్ళు, బాధలుపడుతున్నవాళ్ళూ లేకపోలేదు. వాళ్ళందరూ బ్రతకాలని తాపత్రయం పడుతున్నప్పుడు మనమెందుకు మన ప్రాణాన్ని మనమే తీసుకోవాలీ! సుఖమో, దుఃఖమో రేపన్నరోజు ఎలా ఉంటుందో ఎవ్వరూ చూడలేదు; చూడనిదాన్ని బాగుంటుందనుకోడంలో తప్పేముంది?

ఇవాళ అన్నరోజు బాగున్నవాళ్ళు రేపూ అలాగే ఉందనుకొంటారు.

అలా అనుకొంటే మాత్రం వాళ్ళకి కష్టాలు రాకుండా ఉంటున్నాయా! అలాగే కష్టాలలో ఉన్న వాళ్ళకీ ఎప్పుడో అప్పుడు సుఖాలనేవి రాకపోవు. అంతేకాదు, సుఖపడడమనేది కూడా కొంత మన చేతిలోనే ఉంది. ఎంత సుఖంగా ఉండికూడా ఏవో బాధలుపడుతున్నామనుకునే వాళ్ళూ లేకపోలేదు.

అయితే నాబాధలన్నీ నేను కల్పించుకొంటున్నవే నంటావు?

నేననేది అదికాదు; ఎలాగూ తప్పనివాటిగురించి తల్లడిల్లేకంటె వాటిని మరిచిపోయి సరదాగా ఉండడానికి ప్రయత్నం చెయ్యకూడదా అని. అసలు నేనివాళ నువ్వు పెట్టిన కాఫీ తాగాలని వచ్చేను మళ్ళీ ఎన్నాళ్ళవుతుందో.

కాఫీకేముంది, మళ్ళీ నువ్వు వచ్చేసరికి నేనుంటే—

ఛ! అదేం మాట!

మాటవల్ల మునిగిపోయిందేమీ లేదు గాని, శ్యామలా నన్ను మీ అత్తవారింటికి వంటమనిషిగా తీసుకొని పోకూడదూ?

నువ్వు తమాషాకి అన్నా నేనూ నిజంగా ఆ సంగతి ఆలోచించకపోలేదు. అయితే ఆ మహారణ్యంలో నేనే ఉండలేకపోతున్నాను. మా ఆయనకిగాని ఉద్యోగం అయి, మేం వేరే వెళ్ళిపోతే మాత్రం తప్పకుండా నిన్ను నా దగ్గరికి తీసుకొని వెళ్ళిపోతాను— నేను తెద్దామనుకొని మరిచిపోయాను. సాయంత్రం మా తమ్ముడిచేత పంపిస్తాను, మా ఆయన ఎడ్రసు రాయించి ఉంచేను పదికవర్లు. నా ఉత్తరం వచ్చినవెంటనే నువ్వు మళ్ళీ ఉత్తరం రాస్తూ ఉండాలి, తెలిసిందా!

రాస్తాన్లేగాని, కవర్లెందుకే?...

ఎందుకా, నువ్వు ముందు కవరు తెప్పిద్దాం తరవాత రాద్దాం అనుకొంటూ ఆలస్యం చెయ్యకుండాను. ఈ పదణాల కవర్ల మూలంగా నేనేమీ చెడిపోనులే. నా కక్కడ ఉండగా నీ దగ్గరనించి ఉత్తరం వచ్చిందంటే ప్రాణం లేచివస్తుంది. ఎవళ్ళో వచ్చినట్టున్నారు?

ఆఫీసు జంట్రోతు. కాఫీ పట్టుకెళ్ళడానికి వచ్చేడు. పద కాఫీ పెట్టుకొందాము.

*   *   *

ఎవరురా తమ్ముడూ!

ఎవరో నే, వెంకట్రామయ్యగారున్నారా అనడిగేరు.

వెంకట్రామయ్యగారి గురించా! ఏదీ, ఆc అతనే, కృష్ణమూర్తిగారే, పరుగెత్తివెళ్ళి పిలుచుకు రాగలవు?

ఓ, అలాగే...

....

ఏం తమ్ముడూ దొరకలేదురా!

లేదక్కయ్యా! పరుగెత్తుకొని వెళ్లేను దారిలో అడ్డంగా ఒక కారువచ్చింది. అది నా కారుకింద పడిపోవలిసిందే. నేను తొందరగా వెళ్తాంటే అటునించి ఎవరో నూనె అమ్ముకొనే అమ్మి పరధ్యానంగా వచ్చింది. మా నెంతా ఒలికిపోయింది. అందరూ నాది తప్పు లేదని, దాన్నే తిట్టేరు. ఈలోపుని అతను ఎటు వెళ్ళిపోయేరో మరి కనబడలేదు. అక్కడికి దగ్గరలోనే నాలుగు దార్లు కలుస్తాయి. ఏ దారిని వెళ్లడం? అయినా ఆ దగ్గర్లో ఉన్న వాళ్ళని అడిగిచూసేను. ఎవళ్లూ చూళ్లేదుట. అసలతనెవరక్కయ్యా! ఎందుకు పిలవమన్నావు?

ఇదివరకీ యింట్లో అనూరాధావాళ్లూ ఉండే వారు తెలుసునుకదూ.

అవును. వెంకట్రామయ్యగారువాళ్లీ భావకదూ. ఆయన ఆమధ్యని ఉద్యోగం మానేసి వెళ్ళిపోయారుటకదూ! వాళ్ళీ యింట్లోనే ఉండేవారు. అయితే ఇతన్ని నీకేం. తెలుసును?

ఇతను అప్పుడు కొద్ది రోజులు వాళ్లింట్లో ఉండేవాడు. నిరుడు కాంగ్రెసు అల్లర్లలో జెయిలుకి వెళ్ళేడు. పాపం అనూరాధకోసం వచ్చిఉంటాడు.

ఆవిడ చచ్చిపోయిందికదూ!

చచ్చిపోయిందిరా పాపం. నేనన్నట్టేఅయింది. ఇన్నాళ్లు గడిచేయి. ఈ ఒక్క ఏడాది మెల్లిగా గడిచిపోనీ అన్నాను. ఒక్క ఆరు నెల్లలో అంతా ఇలా అయిపోయింది. అసలు నాదీ బుద్ధితక్కువ. మా అత్తారింటికి నాతో తీసుకుపోవలసింది. ధైర్యం చాలింది కాదు.

అదేమిటే అక్కయ్యా అలా అంటావు. ఎక్కడయితే మాత్రం జబ్బులు రావా? మనుష్యులు చచ్చిపోరా? అన్ని మందులు పోశారు, అందరు డాక్టర్లు వచ్చారు, మన అమ్మని బ్రతికించి ఉంచగలిగేరా?

జబ్బొచ్చి పోతే విచారమే లేదురా! నీకు తెలియదులే ఆ గొడవంతా! ఆవిడ బలవంతంగా చచ్చిపోయింది. తరవాత నాలుగురోజులకి వాళ్లక్కయ్య చచ్చిపోయింది——అప్పటికిగాని అతనికి బుద్ధిరాలేదు. ఉద్యోగం విడిచిపెట్టిపోయి సన్యాసుల్లో కలిసిపోయాడు. ఎన్ని గొడవలు పడినా ఇతను జైల్లోనించి బయటపడివచ్చేదాక, అనూరాధ బ్రతికిఉంటే, తరవాత కలకాలం సుఖంగా ఉండిఉండును. అతనికి పాపం ఈ సంగతులు చెప్పేవాళ్ళెవళ్ళు? చెప్పినా, ఏవేవో కల్పించి చెస్తారు. ఈమారెప్పుడైనా కనిపిస్తే తీసుకురా! అనూరాధ చచ్చిపోయే ముందు నాకు రాసిన ఉత్తరమయినా చూస్తాడు. ఆఉత్తరం రాసిన తరవాత మరి రెండు రోజులు ఆగిఉంటే బాధ లేకపోవును. నేను ఇవతల బండిలోంచి దిగుతున్నాను. అవతల శవాన్ని తీసుకొని వెళ్ళిపోతున్నారు.

*   *   *   *

ఏమిరా యాజులూ! చాలా కాలానికి తిరిగి వచ్చేవు.

అవునురా శర్మా! రోజు రోజూ యాత్రలకని బయలుదేరలేముకదా! ఎలాగూ వెళ్లినప్పుడు నాలుగూ పూర్తి చేసుకొనివద్దామని. మరేమిటి విశేషాలు?

విశేషాలేమీ లేవుగాని, ఈ మధ్యని మన చిన్నప్పటి సహాధ్యాయి కృష్ణమూర్తి వచ్చేడు. తెలుసునా?

అరె, నాకేమీ తెలీదే, ఎన్నాళ్లయింది వచ్చి? ఉన్నాడా?

వచ్చి, ఎక్కడ పదిహేనురోజులయింది. మొన్న ఉదయం కనిపించినప్పుడు, ఆ వేళ సాయంత్రం వెళ్ళిపోతున్నానన్నాడు.

అయ్యో, అయితే, ఎన్నాళ్లకో వాడు రాక రాకవస్తే వేళకు నేను ఊళ్లో లేకపోయేనన్నమాట! ఎక్కడికి వెళ్తాడో అదయినా చెప్పేడా?

ఆ సంగతి అతనికిమాత్రం తెలిస్తేకదూ? ఎక్కడికి అని అడక్కు శర్మా అన్నాడు. ఇక్కడ మరేముంది, మా అమ్మకూడా లేదు; ఎక్కడికో ఒక చోటికి పోతాను. ఏదోవిధంగా బ్రతుకుతాను అన్నాడు.

అంత దిగులుగా ఉన్నాడన్న మాట! పాపం, వాడు చదివిన చదువుకి ఈపాటికి ఏ తాసిల్దారో కావలసింది.

గుమాస్తాపని దొరికితే తాసిల్దారీ దొరికినట్టే. గవర్నమెంటులో అదీ దొరకదట, అప్పుడు నేను జైల్లో పడ్డాడయ్యా మన కృష్ణమూర్తి అంటే నువ్వు కొట్టొచ్చావు. వాడు మరెవడో కృష్ణమూర్తి అయుంటాడన్నావు. ఉంటే వాడి నోటంటే వినుందువు, మనిషికూడా బాగా తీసిపోయేడు, మునపటి రంగులేదు.

అలాటివాణ్ణి మరి నాలుగురోజులుండమని బలవంతం చెయ్యలేకపోయాన్రా! వాళ్ల కామాక్షికి తెలుసునేమో ఎక్కడికి వెళ్లేడో...

తెలిస్తే ఏం చేస్తావురా?

ఏం చేస్తావా? వెళ్ళి తీసుకొనివచ్చి మందో మాకో ఇచ్చి వాడి ఆరోగ్యం బాగయేలా చేస్తాను. వాడిష్టపడి చేసుకొంటానంటే మంచి సంబంధం తెచ్చి పెళ్ళిచేస్తాను—నాకెంతో ఇదిగా ఉంది వాడు వచ్చేసరికి నేను లేకపోయేనని. అయినా కామాక్షినడిగి చూడాలని.

లాభం లేదురా! వాడు వాళ్లింట్లో అసలుండలేదు. వాళ్ళమ్మ పోయేసరికి మనకి ఎక్కడున్నాడో కూడా తెలియలేదుకదా. మొత్తానికి వాడు ఈ ఊరు వచ్చేదాకా కూడా వాళ్లమ్మ పోయిందని వాడికి తెలీదు. ఆమాట తెలియగానే తిన్నగా వచ్చిన దారినే బయలుదేరిపోయాడు. దారిలో కరణంగారి అబ్బాయి నిలబడి బతిమాలి ఆపితే ఆగాడు. కొంతసేపల్లా బాగా మాట్లాడేవాడు, అంతలోనే మళ్ళీ ఏమి వచ్చేదో పరధ్యానంగా అయిపోయేవాడు, ఎంతో బాధపడుతున్నట్టుగా మొగం ఉండేది. ఒక్కడూ వెళ్ళి మనం చిన్నప్పుడాడుకొనే తోటలో వంక మామిడిచెట్టు మొదట కూర్చునేవాడు. సాయంకాలమే కాదు, రాత్రయిపోయినా అలాగే కూర్చునేవాడు ఎవళ్లయినా వెళ్లి పిలుచుకొని వచ్చేదాకా!

ఒరే శర్మా మీకు బుద్ధిలేదురా, నేనెలాగూ వస్తానని తెలుసునుకదా! మరి నాల్రోజులుంచితే! పోనీ కరణంగారబ్బాయికి తెలుసునేమో ఎక్కడికి వెళ్ళేడో ఏమిటో.

* * * *

ఎవరండీ ఈ అబ్బాయి?

ఎవరో నాకూ సరీగా తెలీదు. నిద్రపోయాడా?

భోంచెయ్యగానే పడుక్కోడూ. బాగానే నిద్రపట్టినట్టుంది. ఎందుకు వచ్చేడేమిటి?

అతను రాలేదు, నేనే పిలుచుకొని వచ్చేను. పాపం చాలా నీరసంగా ఉన్నాడు.

అసలు మీకెక్కడ కలిసేడు?

చెప్తే నీకు కోపం వస్తుంది. మన అబ్బాయి పోయిందగ్గర్నించి నాకేమిటో మనసు మనసులో లేదు—ప్రెస్సులో కూర్చోలేక పోతున్నాను. ఎంతసేపూ వాడు, అబ్బాయి, అక్కడ తిరుగుతున్నట్టు, నాన్నా ఈ ప్రూఫులు చూస్తారా? ఆ లెటర్ హెడ్సు పంపించేసేదా అని అడుగుతున్నట్టే ఉంటుంది. ఇంటిదగ్గరుంటే ప్రెస్సుకి పోతే బాగుంటుందనీ, ప్రెస్సులో ఇంటిదగ్గరే నయమనీ అనిపిస్తుంది. రోజూ సాయంకాలం అలా తిరగడానికి పోతున్నాను, ఊరవతలికి. ఇతనెవరో రోజూ నాకంటే ముందుగా వస్తున్నాడు—నువ్వేమంటే అనుగాని ఆ శ్మశాన వాతావరణంలోనే మనస్సుకి ఏదో కొంత శాంతి కనిపిస్తుందేమో. నాలుగురోజులాయి కనిపిస్తున్నా ఏమీ మాట్లాడలేదు. ఇవాళ మరి ఊరుకోలేకపోయాను. దూరంనించి చూస్తే, సరిగా తెలియలేదుగాని మనిషి బాగా శుష్కించిపోయి ఉన్నాడు. మూడురోజులాయి సరిగా ఏమీ తినలేదట. ఇవాళ నేను పిలవకపోతే ఏమవునో! ప్రాణంపోతున్నా ఒకర్ని ఏమీ అడిగే అలవాటు లేనివాడులాగున్నాడు.

పాపం, ఇంత చిన్న కుర్రవాడికెందుకో అంత విచారం? ఏం కష్టం వచ్చిందో?

ఏమిటో, ఏమీ చెప్పలేనన్నాడు. ఎవళ్ళ శాంతా! నిద్రపోలేదామ్మా!

లేదు నాన్నా!

ఏమమ్మా ఇవాళ మనింటికి వచ్చిన అబ్బాయిని చూస్తే మీ అన్నయ్య జ్ఞాపకం రావడం లేదమ్మా?

నేనూ అదే అనుకొన్నాను నాన్నా! అయితే మన అన్నయ్య ఇంతకంటె కొంచెం పొట్టి, మరి కొంచెం తెలుపు. కాని పోలికలుకూడా లేకపోలేదు.

ఇతను నాతో సరిగా ఏమీ చెప్పలేదుగాని, నా వాళ్ళని ఎవ్వరూ లేరన్నాడు. మనింట్లో ఉండిపోతే, ఎంత బాగుంటుంది.

ఎందుకుంటాడు! ఏదో మనసుకి కష్టంగా ఉండి అలా ఉన్నాడు. నాల్రోజులుపోతే తన

దారిని తాను వెళ్ళిపోతాడు. తానెవరో, మన మెవరమో!

చూడమ్మా! శాంతా! మీ అమ్మకి అన్నీ అనుమానాలే. ఏం ఎందుకుండడూ? తను చదువుకొన్నవాడిలాగే ఉన్నాడు. తను ఇషపడితే ప్రెస్సుపనంతా అప్పజెప్పి, నేను రామా కృష్ణా అనుకొంటూ కూర్చుంటాను. నీ పెళ్ళికూడా అయిపోతే...

నీకు రాత్రి పగలూ ఇదే ఆలోచనలాగుంది నాన్నా. ఇప్పుడేం తొందర వచ్చింది? ఇంకా అన్నయ్య పోయి మూణ్ణెల్లయినా కాలేదు. మధ్యాహ్నంకూడా నువ్వు నిద్రపోయినట్టు లేదు, పడుకో నాన్నా!

అలాగేనమ్మా నువ్వు పడుకో—

* * * *

ఏమిటమ్మా శాంతా! అలా చూస్తున్నావు.

ఏమీ లేదమ్మా! అన్నయ్యింకా ప్రెస్సునుండి రాలేదేమని. రోజూ మామూలుగా వచ్చే వేళ కూడా దాటిపోయింది. ఇవాళ అయిదు గంటలకల్లా వస్తానన్నాడు. ఇప్పుడెప్పుడే ఆరుంబావయిపోయింది. ఈసరికి సినీమా మొదలుపెట్టేస్తారేమో?

సినీమాకా? పోనీ నువ్వు వెళ్ళకూడదూ, పొరుగువాళ్ళ సరోజనిని సాయం తీసుకుని.

కాదమ్మా! ఇవాళ చాలా మంచి ఇంగ్లీషు సినీమా. అన్నయ్య ఈ ఆరు నెల్లలోనూ ఒక్క సినీమా అయినా చూడలేదు. ఇవాళ ఎంత బలవంతం చేస్తేనో ఒప్పుకొన్నాడు. అట్టే పనిలేదు, నాలుగున్నరకే వస్తానన్నాడు. ఇంకా రాలేదు.

ఏదో అర్జంటుపని వచ్చింది కాబోలు.

అదేం కాదమ్మా! అతనేదో భోంచేసి పనిచేసుకొంటూఉంటే మామూలుగానే ఉంటున్నాడనుకొంటున్నారు, నువ్వు నాన్నాను. మనసులో ఇంకా ఏదో బాధపడుతున్నాడనే నా అనుమానం. అందుకే అస్తమానం ఏదో పని పెట్టుకొంటూఉంటాడు. చదివినా చదవకపోయినా ఏదో పుస్తకం మొగానికి అడ్డుపెట్టుకొంటాడు. ఈమాదిరి అయితే ఈ అన్నయ్యకూడా మనకి దక్కడనే నా అనుమానం.

అదేమిటే నీ మాటలు చిత్రంగా ఉన్నాయి.

చిత్రమేం లేదమ్మా! ఇవాళయినా ఎంతో బలవంతంచేస్తే సినీమాకి వస్తానన్నాడు. కావాలనే రావడం మానేసిఉంటాడు.

మనమేం చెయ్యగలమమ్మా తనంతట తనకి సరదాగా ఉండాలని లేకపోతే. మీ నాన్నగారుకూడా అన్నారు. అంతలా రోజంతా కష్టపడొద్దని. అంటే నాకీ పనిచెయ్యడమే సరదాగా ఉందని అన్నాడట!

నాకు తెలుసును. మరింక చూసి లాభం లేదు. నేను బయలుదేరతాను. అలా ప్రెస్సుపక్కనించి వెళ్తాను. ఈలోగా దార్లో కనిపిస్తే బాధే లేదు. జట్కాలో వెళ్తాము.

అయితే ఇక్కణ్ణించే జట్కా వేయించుకొని వెళ్ళిపోకూడదూ?

అలాగే చేస్తానమ్మా. నాకు తెలుసును నీ భయం. కాకుల్లా కూసేవాళ్ళు ఎలా కూసినా కుయ్యనీ—

* * * *

అబ్బాయేడే? ఎక్కడా కనబడడు.

ఇంట్లో ఉన్నట్టులేడు. ప్రెస్సుకి వెళ్ళేడేమో?

ప్రెస్సుకా? ఇవాళ సెలవు, పనివాళ్ళెవళ్ళూ రారు!

సెలవయినా పనిరోజయినా తనకొకటే— భోజనం నిద్రాతప్ప తక్కినవేళంతా ప్రెస్సే తన లోకం.

అటువంటివాడిని అనడానికి నోరెలాగ వచ్చిందో.

లోకులకేమిటి? తమలో ఉన్న కుళ్ళునంతా ఇతరులకి అంటించడానికి చూస్తారు. అయినా వాళ్ళనీ అని లాభంలేదు. అతనెవరో కొత్తమనిషి, మనింట్లో ఉంటున్నాడు; మనమ్మాయితో చనవుగా ఉంటున్నాడు.

అయితే అంతమాత్రంలో అపనిందలు వెయ్యడమేనా?

వేసేవాళ్ళు మన నడిగి వేస్తారా? నాకు మొదణ్ణించీ ఈ భయంఉంది. అయితే మొదట్లో నాకింకో బుద్ధి ఉండేది. తరవాత పోయిందనుకోండి. ఈడుజోడుగా ఉంటారు, ఎవడికో ఇచ్చేకంటె ఇతడికే ఇస్తే మనపిల్లా అల్లుడూ మనింట్లోనే ఉంటారనుకొన్నాను. కాని తను అమ్మా అమ్మా అని పిలవడంతో నాకుకూడా మనసు మారిపోయింది. శాంతతో కూడా అతను స్పష్టంగా చెప్పేసేడు. చెల్లెమ్మా నాదగ్గర నువ్వనవసరంగా మొగమాటపడకు - నాకు

మొదటినుంచీ చెల్లెళ్ళులేరు; నీకు ఉండీ అన్నయ్య లేకుండాపోయాడు. మనమిద్దరం అన్నాచెల్లెళ్ళం, ఎవరేమనుకొన్నా సరేఅని.

అటువంటివాళ్ళమీదా అపనిందలు ?

ఏంచేస్తాం, లోకం తీరేఅంత – మరి అమ్మాయి కెలా అవుతుందో ?

అయినప్పుడే అవుతుంది. నువ్వేమీ బాధపడి అతనిముందేమీ అనకు. అసలితను ప్రెస్సుకే వెళ్లేడంటావా ? ఏదీ, అదుగో, తాళాలిక్కడేఉన్నాయి. నేనలా వెళ్ళివస్తాను. నువ్వు వెళ్ళి అమ్మాయిని చూడు. ఈ ఒక్కసంబంధం తిరిగిపోయినంతలో మరేం మునిగిపోలేదు. ప్రపంచంలో ఇంకా నీతీ, నిజాయితీ, మనుష్యులంటే నమ్మకం ఉన్నవాళ్లూ ఉండకపోరు.

*   *   *   *

మరొక్క నిమిషం నేను ఆలస్యంగా వెళ్ళి ఉంటే రైలు కదిలిపోను. మళ్లీ జన్మలో ఇతన్ని చూడలేకపోదును. నేను దిగమంటే దిగేడుగాని, మళ్ళీ రయిల్లో వెళ్ళిపోతానన్నాడు. నేను స్పష్టంగా చెప్పేశాను, శాంతకి శాశ్వతంగా పెళ్లికాకపోయినా నాకిష్టమేగాని, నిన్నుచూడకుండా ఉండలేనని.

నాకూ అలాగే అనిపించింది. కాని ఏమిటన్నాడు ?

ఏమీఅనలేదు, వచ్చాడు. నువ్వుమాత్రం దాని పెళ్లిమాట అతనిముందు ఎత్తకు. అసలు మనదే పొరపాటు. ఇద్దరిపెళ్ళిళ్లు ఒక్కమారే నిశ్చయం చేస్తే సరిపోతుంది.

అదిమాత్రం అంత తేలికా? వీళ్లూ వాళ్లూ ఊళ్ళోవాళ్లు అందరూ ఇష్టపడాలికదా?

పడతారు, ఎందుకు పడరూ? పడేలా చేస్తాము.

*   *   *   *

నువ్వు మరేం గాభరాపడకు శాంతా! మా కృష్ణమూర్తిఅన్నయ్య నాతో అంతా చెప్పాడు. ఇదివరకు వచ్చిన ఒకటి రెండు సంబంధాలు తప్పిపోయిన సైనంకూడా చెప్పాడు.

అయితే మీకన్నీ తెలుసునన్నమాట !

తెలుసుననే అనుకుంటున్నాను. మీ అన్నాచెల్లెళ్ళ మధ్యనున్న సామరస్యం మా అక్కచెల్లెళ్ళతో నాకుంటే బాగుండిపోను. నేను ఒక్కణ్ణే ఇంటికి మగపిల్లవాణ్ణి కావడం వాళ్లకి తమ నేదో అన్యాయం చేసినట్టుంది. మా నాన్న తమకి అట్టే ఇవ్వకపోడానికంతా నాదే బాధ్యత అని. నేను ఎవరితోనయినా ఒకరితో కాస్త కలుపుగోలుతనంగా ఉందామంటే తక్కినవాళ్ళకి ఈర్ష్య. అందరితోనూ కలిసిమెలిసి ఉండడం మళ్ళీ ఎవ్వరికీ ఇష్టంలేదు. నేనిలా అంటున్నానని భయపడుతున్నావేమిటి?

భయం నాకెందుకు? నేను మిమ్మల్ని చూసి, మీ చదువుగురించి విని, ముఖ్యంగా మా అన్నయ్యకి మీరు నచ్చేరని చేసుకొన్నాను. మీ ఆస్తంతా మీ అక్కచెల్లెళ్ళకిచ్చినా నాకు విచారంలేదు.

ఆఁ అంతా ఎందుకిచ్చేస్తారు? అయినా మనకి తోచి మనం ఇవ్వాలిగాని వాళ్ళు దెబ్బలాడి ఏం పుచ్చుకొంటారు? ఏమిటో ఇంకా నీమొహం విచారంగా ఉన్నట్టుంది.

అబ్బే, విచార మేమీలేదే...

నువ్వు దాస్తే మాత్రం దాగుతుందా!

దాచడాని కేమీలేను. ఈ ముహూర్తానికే మా అన్నయ్య పెళ్ళికూడా అయిపోతుం దనుకొన్నాము. అది, మరి కుదిరిందికాదు, మా అన్నయ్యను ఒక్కణ్ణీ విడిచిపెట్టి వెళ్ళిపోడం అంటే కష్టంగానే ఉంది. తనికీ పెళ్లయిందంటే కొంత.

నువ్వేమీ నీ మనస్సుని కష్టపెట్టుకోని అక్కడికి రానక్కర్లేదు. ఎన్నాళ్లు కావాలంటే అన్నాళ్లు ఇక్కడ ఉంటూ ఉండవచ్చును.

అదెలా కుదురుతుందిలెండి. అంతా మనిష్టమేనా పెద్దవాళ్ల మాటప్రకారం నడుచుకోవాలిగాని.

అటువంటి భయమేం లేదు. నేను మానాన్నగారి మాటప్రకారం నడుచుకొనే మాటయితే ఇప్పటికప్పుడే అయిదారేళ్ళక్రితమే నా పెళ్లి అయిపోయివుండును. ఈసరికి ఇద్దరో ముగ్గురో పిల్లలు పుట్టి ఉందురు.

పుట్టిఉండవలసిన పిల్లలగురించే ఇంత ప్రేమ చూపిస్తున్నారు; ఇక నిజంగా పిల్లలే పుడితే...

ఏదో మాటవరసకి సరదాగా అన్నానుగాని నాకేం పిల్లలు అక్కర్లేదు. అసలు మీ ఆడవాళ్లలో ఉన్న దుర్గుణమే ఇది. పెళ్లయిన మర్నాటినుండి పిల్లలు పిల్లలు అని. మరి తమిగోల ఏమీ అక్కర్లేనట్టు — నేనింకా మనమిద్దరమూ కలిసి మన దేశమంతా తిరిగిరావాలనుకొంటున్నాను. అంతేత మానుకో, పిల్లలుగాని పుడితే వాళ్ల పూచీ అంతా నీదే.

ఇప్పటినుంచీ మనకెందుకీ వాదులాట?

* * *

మీ అన్నయ్య ప్రణయకలాపం, దారిలో పడేటట్టేఉంది.

ఏమిటేమిటి, మీరేదో చిత్రమయిన మాటలు చెప్తారు? గాలికబుర్లేనా, అసలు ఏమయినా ఉందా?

చెప్పానుకదూ అప్పుడు. ఆవిడ స్కూళ్ళ ఇన్‌స్పెక్ట్రెసు ఒకావిడ ఉందని, ఆవిడని మీ అన్నయ్యకి పరిచయం చేసేను. పరిచయం దినదినాభివృద్ధి పొందుతున్నాదిట!

అంతేనా?

మరెంతయితే నీకిష్టం? రేపొద్దున్న ఒకనాడు శుభలేఖవస్తేకూడా నమ్మవు కాబోలు?

ఎందుకు నమ్మనూ? మీ మాటెప్పుడూ నాకు నమ్మకమే. మరి మన ప్రయాణం ఈ నెలాఖరుకయినా అవుతుందా?

నీకంత గట్టిగా కావాలంటే ఇవాళే బయలుదేరు. నేను ఇక్కడపనులు తెముల్చుకొని వస్తాను ఈ నెలాఖరుకల్లా — అప్పుడే నీ మొగంలో ఆడపడుచు కళవచ్చేస్తున్నట్టుంది. ఏమిటె అక్కడికి నువ్వువెళ్తే జరగవలసిన పెళ్ళి మరి కాస్త త్వరగా అవుతుందనా నీ ఆశ.

* * *

ఏమిటంత విచారంగా ఉన్నావు?

విచారమేమీలేదుగాని నా కేమిటో మావాళ్ళింటికి వెళ్ళాలనిలేదు. ఇక్కడే...

పురుడుపోసుకోందికి నా అభ్యంతర మేమీ లేదు. కాని బాగుంటుందా? ఒకవేళ మీ అమ్మా నాన్నాకూడా ఏమీ అనుకోకపోయినా, ఊళ్ళో వాళ్ళంతా నేనేదో భర్తగా అధికారం చలాయించి అఘాయిత్యం చేస్తున్నానంటారు. అయినా పుట్టింటికి పోతాననే వాళ్లను తప్ప, పోమనే ఆడదాన్ని నిన్నొక్కతెనే చూసేను.

అదికాదండీ, అప్పుడు మా అన్నయ్యపెళ్ళి, నా పెళ్ళి ఒక్కమారే అవుతుందనుకొన్నాము. ఇప్పటికీ తనపెళ్ళి కాలేదు, మనకి పిల్లలు పుడుతున్నారంటే...

దానికి మనమేం చేస్తాము? ఇదేం బలవంతంగా చేసే వ్యవహారమయితే మూడురోజుల్లో కుదుర్చుకొని వద్దును. అప్పుడు ఆ యినస్పెక్ట్రెస్‌తో ప్రణయకలాపం దారిలో పడుతుందనుకొన్నాను.

నేనూ అలాగే ఆశపడ్డాను.

ఆవిడ నాతో చెప్పిన మాటల్ని బట్టిచూస్తే, ఆవిడ లోపం ఏమీలేదనే తోస్తుంది. కావాలంటే ఉద్యోగం మానుకోందికికూడా అభ్యంతరం లేదంది. మరి మనం చేసేది ఏమీలేదు, ఆ సమయం వచ్చేవరకూ ఓపికగా యెదురుచూడ్డమే—

:వర్షం:

ప్రియమైన అన్నయ్యకు శాంత అనేక నమస్కారములు చేసి వ్రాయునది: తె॥ ఇచ్చట నేనూ శ్రీ మీ బావగారు చి॥ వెంకటరమణ కులాసాగా వున్నాము. అచ్చట నీవు మ॥ ల॥ స॥ అమ్మ, మ॥ రా॥ శ్రీ నాన్నగారు అందరూ క్షేమంగా వున్న సంగతి వ్రాయించగోర్తాను.

ఇంగ్లీషువైద్యము మానిపించి ఆయుర్వేద వైద్యము మొదలుపెట్టుటవలన నాన్నగారి ఆరోగ్యములో ఏమయినా మెరుగు కనిపించినదా? మీ బావగారికి ఆయుర్వేద వైద్యములో ఎంతమాత్రమును నమ్మకములేదు. ఆయనకు ఇక్కడకు వచ్చిన ఒక కొత్తడాక్టరుగారు, సుబ్బరామయ్యగారని, వారిమీద చాలా నమ్మకముగా ఉన్నది. నిజముగా కూడా, డాక్టరుగారు చాలా సమర్థులనే అందరూ అంటున్నారు. ఈమధ్యను మా కుర్రవాడు చి॥ వెంకటరమణకు చాలా ప్రమాదం చేసినప్పుడు కేవలం ఆయనే భగవంతునిలాగ అడ్డుపడ్డారు. మీరు అనవసరంగా బాధపడతారని ఆయన రాయవద్దన్నారు. మొదట కొంచెం జలుబుగా ప్రారంభించినది; తరవాత జ్వరము; నిమోనియా అన్నారు. చాలా భయపడ్డాము. కాని, భగవంతుని దయవలన ఇప్పుడు హాయిగా ఆడుకొంటున్నాడు.

నాన్నగారికి స్థలం మార్చడంకూడా కొంత మంచిది గనక, ఇక్కడకువచ్చి కొన్నాళ్లుండి ఈ వైద్యముకూడా ప్రయత్నించడం చాలా మంచిదని ఆయన గట్టిగా రాయమన్నారు.

ఇచ్చట ఈ సంవత్సరం వర్షములు చాలా ఎక్కువగా పడుచున్నవి; ప్రతిరోజూ ఉదయమో సాయంత్రమో వర్షము పడుచునేయున్నది. మా పెరటిలోని పూరిసాలను, రేకులతో వేయించి, గోడలు కూడా పెట్టించినాము. పశువులకు, కర్రలు మొదలయినవి

పెట్టుకోందికి మంచి సదుపాయముగా నున్నది. ఆయన ఆఫీసుగదిలోని పాతసామాను లోపలగదిలోకి మార్చి కొత్తబీరువాలు రెండు, ఒక పెద్ద టేబిలు, ఆరు కుర్చీలు తెప్పించినారు. ప్రాక్టీసు బాగానే ఉంది; కాని, ఒక్క నిమిషంకూడా తీరికఉండటం లేదు. నాకు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నట్టుంది. కొన్నాళ్ళపాటు అమ్మా నాన్నా వచ్చి ఉంటే చాలా బాగుంటుంది.

అమ్మనూ నాన్ననూ తోడ్కొని సాధ్యమయినంత త్వరలో వస్తావని నమ్ముతున్నాను బయలు దేరేముందు, ఉత్తరంరాస్తే ఆయన స్టేషనుకి వస్తారు. చి॥ వెంకటరమణ నామీద కోపంవచ్చినప్పుడల్లా 'మామదగ్గిరికి ఎల్తాను రైలెక్కి' అని నన్ను బెదరిస్తూ ఉంటాడు.

వెంటనే జవాబు వ్రాస్తావని నమ్ముతున్నాను. ఇంతే సంగతులు. చిత్తగించవలెను.

ఇట్లు

నీ ప్రియమైన చెల్లెలు శాంత.

*　　*　　*　　*

ప్రియమిత్రుడు సోమయాజులుకు కృష్ణమూర్తి వ్రాయునది:—మనం కలుసుకొని చాలా కాలం అయింది. అప్పుడు నేను సుమారు నాలుగేళ్ల క్రితం వచ్చినప్పుడు నువ్వు ఊళ్లోలేవు. వచ్చినవెంటనే తిరిగిపోవాలనుకొన్నవాణ్ణి నీ కోసం పదిహేను రోజులుపైగా ఉన్నాను. అప్పటికీ నువ్వు రాలేదు. నేను మరి ఉండలేక బయలుదేరిపోయాను; ఎక్కడికి ఏమిటీ అనే ఆలోచనలేకుండానే. ఆ తరవాత వ్యవహారం అంతా రాయబూనుకొంటే అదంతా ఒక పెద్ద గ్రంథం అవుతుంది. కాబట్టి మనం మాట్లాడుకోందికిగాను అది వాయిదా వేస్తున్నాను.

ఈమధ్యను అంటే ఒక పదిరోజుల క్రితం మా చెల్లెలిగారి ఊరు వెళ్లేను. అప్పుడు మన ఊరువిడిచిపెట్టిన నేను, ఒక చెల్లెల్నే కాదు, అమ్మనూ నాన్ననూ కూడా సంపాదించాను. వాళ్ళ ఊళ్లో ఒకనాడు సాయంకాలం షికారువెళ్తూండగా ఒక కుర్రవాడు కనిపించాడు. వాడిని చూసి అడగకుండా ఉండలేకపోయాను, "అబ్బాయీ మీనాన్నగారెవరు?" అని. నా అనుమానం నిజమయింది. మీవాడే. నేనన్నాను, "అబ్బాయీ, నీ అంతవయస్సులో నేనూ మీనాన్నా ప్రాణస్నేహితులమని. నన్ను ఇంటికి వచ్చి వాళ్ళతమ్ముణ్ణి చెల్లెల్ని చూసి తీరాలన్నాడు. మీసరస్వతిని నేను పోల్చుకోలేక పోయాను. తాను మాత్రం నన్ను పోల్చుకోంది. అదివరకు ఎప్పుడో రైల్లో వెళ్తూ ఉంటేకూడా తను నన్నుగుర్తుపట్టిందట?

మనం కలుసుకొని చాలాకాలమయింది. మన జీవిత శకటాలు చాలా దూరం వేర్వేరు మార్గాలను అనుసరించి సాగిపోయాయి. ఆనాడు రాత్రి నేను ముందుగా రైలెక్కకుండా నిన్నే ఎక్కించిఉంటే ఇద్దరం కలిసే ప్రయాణించి ఉండేవాళ్లమేమో? ఆనాటిరాత్రి నువ్విచ్చిన రెండురూపాయిలు ఇంకా నాదగ్గర భద్రంగా ఉన్నాయి.

ఈఉత్తరం రాయడానికి ముందు నేనే బయలుదేరి రావాలనుకొన్నాను. కాని, అంతకంటె నువ్వే ఇక్కడకు రావడం చాలా బాగుంటుందని నా నమ్మకం. ఇక్కడ మాయింట్లో అమ్మానాన్నకూడా లేరు; నేను ఒంటరిగానే ఉంటున్నాను అందుచేత నీకేమీ మొగమాటంగా ఉండదు.

వచ్చేటప్పుడు అక్కడి మా మామయ్యగారి తోటలోవి మంచిపళ్లు ఏవయినా తీసుకొనిరావలెను.

ఎప్పుడు బయలుదేరివచ్చేదీ ముందుగా రాస్తే నేను స్టేషనుకి వస్తాను. ఇంటియడ్రసు దిగువను రాస్తున్నాను ఎందుకయినా మంచిదని. వెంటనే జవాబు రాస్తావుకదూ!

ఇట్లు నీ

కృష్ణమూర్తి.

*　　*　　*　　*

ఏమని సంబోధించాలో తెలియక ఏసంబోధనా లేకుండానే ఈఉత్తరం ఇలాఆరంభిస్తున్నాను. ఆవేళ నీచేతికాఫీ తాగినదగ్గరనుంచీ నాలో ఏదో కొత్త అలజడి ప్రారంభమయింది. అలజడి అంటే మరేమీ కాదు. ఏ కారణాలవల్లనయితే నేమి, మన ఇద్దరి జీవితాలు మోడువారిపోయినాయి. కాని, ఈ నేటి వర్షాలకు మళ్ళీ చిగురించి, కుసుమించడానికి అవకాశం లేకపోలేదనే ఆశ లేశమాత్రంగానయినా కలుగుతూంది. నీ మాటలలోనే కాదు, నీ మనసులో కూడా ఎంతో పెద్దదాననే భావం జీర్ణించిపోయినా నాకంటె అయిదారేళ్ళు చిన్నదానివనే మాట నాకు బాగా జ్ఞాపకం ఉంది. నీకూ జ్ఞాపకం ఉండే ఉండాలి.

నేను ఆవేళ కాఫీ తాగివచ్చిన వెంటనే, నీకే ముందుగా రాయాలనుకొన్నాను. కాని, కొంత ఆలోచించినమీదట, నువ్వు ఎలాగూ అన్నిటికీ వా

అన్నయ్య యిష్టం అంటావని తెలిసి, మీ అన్నయ్య సోమయాజులు పేర రాశాను ఇక్కడికి రమ్మని. అతను నా మాట కాదనకుండా ఉత్తరం అందిన వెంటనే బయలుదేరివచ్చేశు. ఒక వారం రోజులపాటున్నాడు. హాయిగా మళ్ళీ చిన్నతనం వచ్చినట్లుగా నే ఆ వారం రోజులూ గడిపేము.

అతనితో నా అభిప్రాయం చెప్పాను. ఇద్దరం కలిసి బయలుదేరి నీదగ్గరకు రావాలనుకొన్నాము. కాని, నాకు నచ్చలేదు. యాజులు అన్నాడు, పోనీ నేను వెళ్ళి కనుక్కొంటానని. నాకు అదీ ఇష్టం లేకపోయింది.

నిన్ను ఏమాత్రం బలవంతం చెయ్యడం నాకిష్టం లేదు. నేను గాని, మీ అన్నయ్య గాని, ఎదురుగా ఉండి, గట్టిగా నిన్ను అడిగి, నీ అభ్యంతరం ఏమిటి చెప్పు అంటే నువ్వేమీ చెప్పలేవు అని నాకు తెలుసును.

కాబట్టి నేను నీకు తగినంత వ్యవధి ఇస్తున్నాను. అంతే కాదు, నీకు ఇష్టంలేకపోతే అందుకు కారణాలేమీ తెలియజేయ నక్కరలేదు. మళ్లీ నీ జీవితమార్గంలో ఎన్నటికీ పొరపాటునైనా అడుగు పెట్టకుండా ఉండడానికే ప్రయత్నిస్తాను.

ఒకవేళ నువ్వేగాని ఇష్టపడితే, అంత అదృష్టమే గాని నాకు లభిస్తే, నీకు నేను పెద్ద ఐశ్వర్యమూ భోగభాగ్యాలూ కలుగజేస్తానని హామీ ఇవ్వలేను; కాని, నీ జీవికగురించి నువ్వేమీ ఆలోచించవలసిన అవసరం లేకుండా బాధ్యత వహించగలనని మాట ఇస్తున్నాను. అంతే కాదు, నీ ఆనందాన్ని అనుబంధాలనీ వేటినీ విడిచిపెట్టుకో నక్కరలేదు. నీ మేనల్లుళ్లకు నీదగ్గర ఎంత చనవో నాకు తెలుసును. వాళ్లు కూడా నీదగ్గరే ఉండవచ్చును.

ఇక సంఘభయం గురించి; ఎందుకు నేను ఎక్కువగా రాయడం? మామూలు చదువు అనేది నీవు ఎక్కువగా చదువుకోకపోయినప్పటికీ, కొంత వయసు, ప్రపంచజ్ఞానం ఉన్నాయి గనక, ఒకరి సలహా అక్కరలేకుండా నువ్వే స్వయంగా ఆలోచించగలవు. ఒకప్పుడు నా దృష్టిలో మీ అన్నయ్య దృష్టిలో నీ నిర్ణయం పొరపాటు కావచ్చును. కాని, పొరపాటో మంచో, ఎవరి భవిష్యత్తుని నిర్ణయించుకొనే అధికారం వారిది. నేనిదంతా ఎందుకు రాస్తున్నానంటే, తానెంత సనాతనవాతావరణంలో పుట్టి పెరిగినవాడైనా మీ అన్నయ్యకు మాత్రం ఈ అంశంలో ఎటువంటి అభ్యంతరం లేదు. ముఖ్యంగా మనిద్దరికంటె ఇటువంటి చర్య మూలంగా, మన అనుబంధాన్ని పురస్కరించుకొని తాను సంఘంలో ఎక్కువ అవమానం భరించవలసి వస్తుంది.

నేను చిన్నతనంలో అప్పుడు పారిపోకుండా మామయ్యగారింట్లో నే ఉండిఉంటే సరస్వతి నే గాని కామాక్షిని చేసుకోను అనాలనుకు నేవాణ్ణి. కాని, నేనున్నా మీవాళ్లు నీ మూలంగావచ్చే డబ్బును ఒదులుకొందికి ఇష్టపడకపోదురు; నా మామయ్య కూడా ఎలాగో నా మెడలువంచి, మంచిమాటలు చెప్పి, కామాక్షినిచ్చి పెళ్ళిచేసిఉండేవాడు. ఎందువల్లనయితే నేం, నేను బయటపడ్డాను. చాలా చాలా తిరిగాను. ఎన్నెన్నో ప్రాణాపాయపరిస్థితులను ఎదుర్కొన్నాను. కాని, తిరిగి తిరిగి భూమి గుండ్రంగా ఉందన్నట్టు చరిత్ర పునరావృత్తమవుతుందన్నట్టు, కొంత వయోభేదంతో మళ్ళీ బయలుదేరిన చోటికే వచ్చి చేరేను.

నేను నిన్ను కోరుతున్నాను; అంటే నా కోసం నిన్ను త్యాగం చెయ్యమని కాదు. నీకు నాతోడి సాహచర్యంవల్ల ఏ లేశమయినా ఆనందం లభించగలదని ఆశ భాసిస్తేనే అవునను. లేదా ఇంకా ఆలోచనకి వ్యవధి కావాలంటే అలాగే కానీ. మనం అంతా వర్తమానాన్ని బట్టి భవిష్యత్తుని ఊహించుకొంటాం. ఈ రకమయిన కలయికవలన మన యిద్దరి జీవిత వీణలూ సమశృతిలో మేళవించి అలరించగలవని నా నమ్మకం.

తప్పకుండా జవాబు రాస్తావని నమ్ముతున్నాను. బహుశః మీ అన్నయ్యకూడా నీకు ఈ సంగతే రాయవచ్చును. కాని నువ్వుమాత్రం అనవసరంగా మొగమాట పడవద్దు. నీకు ఈ నెలాఖరువరకూ ఆలోచించుకొందికి సమయం ఇస్తున్నాను. ఈలోగా నీదగ్గరనుండి ఏ ఉత్తరమూ లేకపోతే నీకు ఈ అంశం ఇష్టంలేదని నిర్ణయించుకొంటాను.

ఇట్లు

ఇంతకాలానికి నీవాడు కాగోరే

కృష్ణమూర్తి.

* * * *

చి॥ కృష్ణమూర్తికి ఆశీర్వచనపురస్సరముగా సోమయాజులు వ్రాయునది. ఉభయకుశలోపరి. త॥ నీదగ్గరనుండి వచ్చిన తరవాత నేను మా సరస్వతి పేర ఉత్తరం రాశాను. నా ఉత్తరం అందిన రెండు రోజుల నాటికే నీ ఉత్తరం అందినదట. అందుమీదట తన

కేమో గాభరాగా ఉన్నదని నన్ను రావలసినదని ఉత్తరము వ్రాసినది. నేను ఇక్కడ మిక్కిలి పని తొందరగా ఉన్నను ఎట్లో వీలుకలుగజేసుకొని వెళ్లి ఒక మూడురోజులుండి వచ్చినాను. మీ ఊరు మీదుగా రావాలనుకొన్నాను గాని, ఇక్కడ ఒక ముఖ్యమయిన రిజిష్ట్రేషనువ్యవహారం ఉండి తిన్నగా రావలసి వచ్చినది.

నేను నీతో చెప్పిన అభ్యంతరాలే తానూ చెప్పింది; నువ్వు నాకు చెప్పినయుక్తులన్నీ నావే అయినట్లుగా చెప్పాను. తాను అంతా మీయిష్టం, మీరెలా అంటే అలాగే చేస్తాను అంటుంది. నేను స్పష్టంగా చెప్పాను, నీ స్వబుద్ధిపూర్వకంగానే జరగాలి తప్ప ఇందులో మాబలవంతం అనేది ఎంత మాత్రం ఉండకూడదని.

ఇది ఇలా ఉండగా ఇంకొకవిషయం ఆలోచించడం మనం మరిచిపోయేము; మొన్న మాసరస్వతి జ్ఞాపకంచేసేవరకు నాకీవిషయం స్ఫురణకే రాలేదు. సరస్వతికి సంబంధించినంతవరకు మా యిద్దరికీ యిష్టం అయితే చాలును. అభ్యంతరం చెప్పేవారెవరూ లేరు. కాని, నీకు సంబంధించినవారి ఇష్టానిష్టాలు మాత్రం గమనించవద్దూ! దైవికంగా నీకు లభించిన మీ తల్లిదండ్రులకూ, ముఖ్యంగా మీ చెల్లెలు శాంతకూ అంగీకారం అవునో కాదో మనం తెలుసుకోవలసి ఉంటుంది.

నీకు గట్టిగా బుద్ధిపుట్టినట్లయితే ఎవరి ఇష్టానిష్టాలను లక్ష్యంచేసేవాడివి కావని నాకు తెలుసును; కాని, వారికి ఏమాత్రం ఇష్టంలేకపోయినా వారి మనస్సులను కష్టపెట్టడం మంచిపనికాదు. నువ్వు ఊ అంటే నీకు కావలసినటువంటి సంప్రదాయమయిన సంబంధం తీసుకొనిరాగలను. సరే, మరెందుకిన్నిమాటలు, నువ్వు మీవాళ్లకు రాయి. వాళ్లింకా అక్కడే ఉన్నారుకదా! నీ ఉత్తరం చూసుకొని అవసరమయితే నేను బయలుదేరి వస్తాను.

ఈమధ్యను కామాక్షిగురించి ఎవరెవరో వదంతులు లేవదీస్తే నేను నమ్మలేదు. అంతా పదిహేను రోజులయింది కాబోలు మగపిల్లవాడు పుట్టేడు. ఊళ్లో అందరూ అనుమానించినట్టు, ఆశించినట్టు ఏ విపరీతమూ జరగలేదు. కామాక్షి మామూలుగానే ఉందిట; తల్లీ పిల్లవాడూ బాగా ఆరోగ్యంగానే ఉన్నారు. ఊళ్లోవాళ్ళు కూడా అప్పుడే బాహాటంగా రాకపోకలు సాగిస్తున్నారు. వితంతువు కన్నదంటే అదేదో వింత అని చూడడానికి ఎగబడుతున్నారు. అంతే కాదు, ఇప్పటికింకా శిశువు తండ్రి ఎవరో తెలియలేదు; నలుగురూ నాలుగు విధాల బుద్ధిబలాన్ని వినియోగించి కనుక్కోడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరిచేత అజ్ఞాతపితగా అంచనా కట్టబడిన వ్యక్తులే తామూ మరికొందరిని అనుమానిస్తున్నట్టున్నారు. అసలిందులోకల్లా చిత్రం ఎక్కడుందంటే ఆమధ్యను కొన్నాళ్లు (అంటే ఒక పదిరోజులపాటు) కామాక్షి కనబడలేదట. కాబట్టి నీ చిన్నతనపు చనువు స్నేహము బాంధవ్యమూ వీటిని పురస్కరించుకొని నువ్వే ఈ అజ్ఞాతపితవు ఏల కారాదు అనే ఊహాశాలురు కూడా లేకపోలేదని వినికిడి! నీగురించి అసందర్భంగా నాతో మాట్లాడ్డానికి ఎవరికీ సాహసం ఉండదులే.

నువ్వు మన అభిప్రాయంగురించి మీవాళ్లకు ఉత్తరం మూలంగా తెలియజేస్తావో, లేక నువ్వే అక్కడికి వెళ్తావో, ఏమైనాసరే పర్యవసానం నాకు వెంటనే తెలియజేస్తే నేను బయలుదేరి వస్తాను. మీ వాళ్లనుమాత్రం అనవసరంగా ఒత్తిడి చెయ్యడం నా కిష్టంలేదు. అయినా నీకు నేను చెప్పేపాటివాణ్ణి కాను.

ఏ సంగతీ వెంటనే ఉత్తరం రాయగోర్తాను.

ఇంతే సంగతులు, గ్రహించవలెను,

ఆ॥ సోమయాజులు వ్రాలు.

*　　*　　*　　*

ప్రియమైన అన్నయ్యకు శాంత అనేక నమస్కారములుచేసి వ్రాయునది. తి॥ ఇచ్చట నేను శ్రీ మీ బావగారు, చి॥ వెంకటరమణ, మ॥ ల॥ స॥ అమ్మ మ॥ రా॥ శ్రీ నాన్నగారు అంతా క్షేమంగా యున్నారు. అచ్చటి నీ క్షేమసమాచారము తిరుచు వ్రాయించగోర్తాను.

ఈ మధ్యను నీవు పంపిన నూటయాభై రూపాయిలు మనియార్డరు అందినది. కాని, శ్రీ మీ బావగారికి చాలా కోపం వచ్చినది; మన యింట్లో మీ అమ్మగారూ నాన్నగారు ఉన్నందుకు ఖర్చుల నిమిత్తం పంపినావేమిటి మీ అన్నయ్య అన్నారు. మనియార్డరు తిప్పి పంపిస్తానన్నారు. కాని నేను చెప్పినమీదట ఊరుకున్నారు.

ఇక, అసలు సంగతి—నీ ఉత్తరం అందిన వెంటనే, అనగా మొన్న సాయంకాలం బయలుదేరి, అమ్మ నేనూ వెళ్లేము మేము ఫలానా అని నేను చెప్పాను ఎక్కువ మాట్లాడలేదు. ఒక్క పదినిమిషాలు మాత్రమే కూర్చున్నాము; ఆవిడ కాఫీ పెడుతున్నారు. ఇంతలో హఠాత్తుగా

అమ్మకు గుండెలో నొప్పివచ్చింది. వెంటనే మేము వెళ్ళిన జట్కాలోనే తిరిగివచ్చాము. నీ పెళ్ళివిషయంలో వర్ణాంతరవివాహం చేసుకొన్నా, విజాతీయ వివాహం చేసుకొన్నా నీమీది అభిమానంకొద్దీ అమ్మా నాన్నా అంగీకరించకపోరు—అమ్మను నేను తరచి తరచి అడిగేను. తనకు మనసులోకూడా ఎటువంటి అభ్యంతరమూ లేదంది. ఒక్క మాట మాత్రం ఏదో మాటవరసను అంది—అయితే ఆవిడ మీ అన్నయ్యకంటె చిన్నదయి ఉంటుందంటావా అని. బహుశః ఆవిడ బట్టకట్టుపద్ధతి, మాటతీరు, అలంకారాలేని శరీరమూ అమ్మకు అలా తోపింపజేసి ఉంటాయి. నేను అంతా చెప్పాను. నీ చిన్నతనము, ఒకే ఊళ్ళో కొంతకాలం పెరగడం, ఆవిడ నీకంటె బాగా అయిదారేళ్ళు చిన్న అయిన సంగతిని స్పష్టంగా చెప్పాను. అమ్మ తనకు ఎటువంటి అభ్యంతరమూ లేదంది. ఇక నాన్నగారు, తనకిది సంపూర్ణంగా ఆమోదమనీ, తను బ్రతికి ఉండగానే ఈ శుభం జరిగిపోడంకంటె తనకు వాంఛనీయ మింకేమీ ఉండదనీ అన్నారు. అందరికంటె ముఖ్యంగా మీ బావగారికి చాలా ఇష్టంగా ఉంది. నేను మొదటి నుంచీ అనుకొంటూనే ఉన్నాను, బావ అందరిలాగా కాక, ఏదో విలక్షణమయిన పని చేస్తాడని. విలక్షణత్వమే కాదు, వేలకి విలువయిన మంచి పని చేస్తున్నావన్నారు, నేను వెళ్లి చూసివచ్చి చెప్పేక—కాబట్టి ఇక్కడ మా యావన్మందికీ అంగీకారమే కాక చాలా ఆతృతగా ఉంది. కాబట్టి మీ స్నేహితులు సోమయాజులు గారికి వెంటనే రాసి, సాధ్యమయినంత త్వరలో ముహూర్తము నిర్ణయింపజేయవలసిందని నాన్నగారూ, మీ బావగారూ రాయమన్నారు. పెళ్ళి కూడా అక్కడెక్కడో పల్లెటూళ్లో కాక ఇక్కడే అయితే బాగుంటుంది; ఏమంటే నాన్న ప్రస్తుతం కదల్చవీలైనస్థితిలో లేరు. ప్రత్యేకించి ఏమీ లేదుగాని, క్రమక్రమంగా నీరసించిపోతున్నారు. డాక్టరుగారు కూడా మరీ ఎక్కువ ఆశాజనకంగా మాట్లాడ్డంలేదు.

అన్ని సంగతులతోనూ వెంటనే ఉత్తరం రాస్తావని నమ్ముతున్నాను. వీలయితే నువ్వే ఒకమారు రావలెను—రాలేకపోతే, ప్రెస్సుకి సంబంధించిన వ్యవహారాలన్నీ వివరంగా రాస్తే నాన్నగారు సంతోషిస్తారు.

ఇంతకాలానికి నీకిటువంటి బుద్ధి పుట్టినందుకు మాకెంతో సంతోషంగా ఉంది. ఏమాత్రం ఆలస్యం కాకుండా వీలయినంత త్వరలో నీవూ సోమయాజులు గారూ కలిసి నిర్ణయించ గోర్తాను.

ఇంతే సంగతులు. చిత్తగించవలెను.

ఇట్లు,
నీ ప్రియమైన చెల్లెలు
శాంత.

* * * *

జీవితేశ్వరి సరస్వతికి!

ఇవాళ ఆషాఢ శుద్ధపాడ్యమి. ఉదయం అంతా వర్షం పడుతూ ఉండడం చేత పనివాళ్ళకి మధ్యాహ్నం సెలవిచ్చేశాను. భోంచేసి పుస్తకం చదువుతూ పడుక్కొంటే చల్లగా నిద్రవచ్చింది. ఇప్పుడే లేచి క్రిందకు వెళ్ళి మొగం కడుక్కొని కాఫీ ఫలహారం చేసివచ్చాను. శాంత బజ్జీలు బూందీ చేసింది. ఎంత బాగున్నాయనుకొన్నావు బజ్జీలు! అవి తింటూంటే నువ్వు చేసిన చేగోడీలు జ్ఞాపకం వచ్చేయి. చిన్నప్పుడెప్పుడో మా అమ్మ చేసింది; తరవాత మళ్లీ నువ్వు చేసేవు, ఈమధ్యకాలంలో అంత రుచికరమయిన ఫలహారం ఎన్నడూ తినలేదు.

ఫలహారం చేసివచ్చి చదువుదామని పుస్తకం తీసేను; కాని ఏమీ చదవాలనిపించలేదు. చుట్టూ ఎటు చూసినా అన్ని కొండలనూ మేఘాలే. కవికుల గురువు కాళిదాసు ఏ కాలంలో రాశాడో మేఘసందేశం, 'ఆషాఢస్య ప్రథమ దివస్తే మేఘమాశ్లిష్ట సానుమ్' అని. అలా నిరంతరంగా వాటివంకే చూస్తూ ఉంటే నాటి యక్షుడికే కాదు, ఏనాటి ప్రేమభిక్షువుకైనా ఆషాఢమేఘం ప్రియురాలికి తన సందేశం తీసుకొని వెళ్ళగలగడంలో అసందర్భం ఏమీ గోచరించదు.

రెండు సంవత్సరాల క్రితం ఆషాఢమేఘాలు కేవలం పనికి ఆటంకాలుగా మాత్రమే నాకు గోచరించేవి. అయితే ఆసంవత్సరం వర్షాకాలంలోనే నిన్ను చూడగలిగేను. గతవర్షాకాలం అంతా మనం కలిసే ఉన్నాము. వర్షామేఘాలు బలవంతంగా సెలవులిప్పించి మనలను కలిపి ఉంచే ఆప్తులవలె ఉండేవి. ఈ సంవత్సరం మనం దూరంగా ఉన్నాము. కాని, మన మనస్సులను మాత్రం ఈఎడబాటు బాధించేదికాదు; ఇందులో మన పొరపాటు ఏమీ లేదు; ఒకరి అజ్ఞాపనా లేదు. అంతేకాదు, భవిష్యత్తునిగూర్చి ఒక సుందరస్వప్నం కంటున్నాము మనం. కావాలంటే ఏరోజయినా

నీదగ్గరకి రాగలను. కాని, రాను. అంతా సవ్యంగా జరిగింది అని ఉత్తరం వచ్చేవరకూ నేను రాను. నాకు మొదట్లో భయంగా ఉండేది; మన వివాహ బంధాన్ని అనేకవిధాలుగా నిరసించదలచినవాళ్ళకి ఎక్కువ సావకాశంగా ఉంటుంది, మనకి సంతానం లేకపోతే. అంతేకాదు, నామటుకు నాకుకూడా, ఇదివరకల్లాలేదు, మా శాంతకొడుకు వెంకటరమణని చూసినదగ్గరనుండీ పిల్లలంటే మక్కువ ఎక్కువయింది. మా శాంత ఇక్కడినుండి వెళ్ళిపోయేటప్పుడల్లా బైటికి అనకపోయినా నాకు మనసులో ఎంతో బాధగా ఉండేది. అందమైన పసిపాప మన మీద ఆధారపడిఉండి మనలనే కావాలనడంకంటె మధురమైన అనుభవం ఇంకేముంటుంది?

ఇంకా ఏమిటేమిటో రాయాలనుకొన్నాను. కాని మరి లాభంలేదు; వెంకటరమణవచ్చి కాగితపుపడవలు, తిరిగేచక్రాలు చెయ్యమంటున్నాడు. గడియారం అరగంట కొట్టడానికి ఇక రెండునిమిషాలు మాత్రమే ఉంది. అంతే వ్యవధిఇచ్చాడు వాడు నాకుఅత్తయ్యకు ఉత్తరం రాసుకొందికి.

నువ్వు ఏదో ఉత్తరానికి ఉత్తరం జవాబు అన్నట్టుకాకుండా పెద్ద ఉత్తరం అన్ని సంగతులతోనూ రాస్తావని నమ్ముతున్నాను.

ఇక్కడ అమ్మ ఆరోగ్యం అలాగే ఉంది; మొదటినుంచీ ఆవిడ అంటూఉండేది నాన్నగారు పోయినతర్వాత మరొక్క ఏడాదికంటె బ్రతకనని. ఇప్పటికి ఆయనపోయి ఎనిమిది నెలలయింది. డాక్టరుగారుకూడా అంత ఆశాజనకంగా చెప్పడంలేదు.

మీఅన్నయ్య అసలేఉత్తరం రాయడంలేదు. ఒకటి రెండురోజులు ఆలస్యం అయినా పెద్దఉత్తరం రాస్తావుకదూ? నీఆరోగ్యం చాలా జాగ్రత్తగాచూసుకోవలసిందని నేను పదేపదే రాయనక్కరలేదు.

నాకు మావాడిచ్చిన టైము దాటి మరి రెండు నిమిషాలైంది. రాస్తావుకదూ!

ఇట్లు,

నీవాడు, కృష్ణమూర్తి.

* * * *

ప్రియమైన అన్నయ్యకు శాంత అనేక నమస్కారములుచేసి వ్రాయునది. త॥ నీ ఉత్తరం అందినది. అక్కడనుండి శుభలేఖకూడా వచ్చినది. తల్లీ పిల్లా క్షేమంగా ఉన్నందుకు చాలా సంతోషం. అందరితోపాటు నేనూ మొదటిమారు మగపిల్లవాడు పుట్టాలని కోరినప్పటికీ ఆడపిల్ల పుట్టిందంటే ఎంతో సరదాగా ఉంది. నేను బైటికి అనకుండా మనసులో ఉంచుకొన్నమాటను మీబావ బైటికి అనేశారు. అయితే మన వెంకటరమణకు పెళ్ళాం పుట్టిందన్నమాట! అని. సరే సంబంధాల మాటకేమి, పిల్లలు ఏ అనారోగ్యమూ లేకుండా పెద్దవాళ్ళయితే అంతే చాలును.

బారసాల పదకొండవరోజున కాక ఇరవైఒకటవ రోజున చేస్తే బాగుంటుందని మీ బావగారు రాయమన్నారు. నాటికయితే మేము రాగలముగాని, అమ్మని ఎలా కదపడమో తెలియకుండా ఉంది. బహుశః రెండుమూడు రోజుల్లో మద్రాసునుండి మా ఆడపడుచు, అత్తగారూ రావాలి; వాళ్లు వస్తే బాధ లేదు, అమ్మను ఇక్కడే ఉంచి నేనూ మీ బావగారూ కలిసివస్తాము.

చి॥ వెంకటరమణకి అక్షరాలు వచ్చేయి; గుణింతాలు నేర్చుకుంటున్నాడు. అస్తమానం నిన్ను తలుస్తూఉంటాడు. తనకొక సైకిలు కొనిపెట్టమని గోలచేస్తున్నాడు; సైకిలెక్కి తిన్నగా రోడ్డంట వెళ్లిపోతే మామయ్యగారి ఊరు వస్తుందట!

ఈమధ్యను మీ బావగారికి ఒక పజిలులో పన్నెండువందల రూపాయిలు వచ్చిందిట; అంటే ఇంకా చెక్కు రాలేదు; పజిల్సంటే నవ్వేవాడు, మీ అన్నయ్యకి రాయి అన్నారు. ఇక్కడ చలి మామూలుకంటె ఈ సంవత్సరం ఎక్కువగా ఉంది. మా చేమంతులు ఇదివరకటికంటె కూడా బాగా పూచేయి. ఈ మధ్యను మీ బావగారి పార్టీ ఒకరు ఆయనకొక పెద్ద పళ్ళతోట పువ్వులతోట ఉన్నాయిట; రకరకాల పూలమొక్కలు పంపించేరు గోతేల్లో. మా డాబా అంతా వాటితో నిండిపోయింది. ఇదివరకు నాకు తెలియని ఎన్నో రంగుల పువ్వులున్నాయి. నీకు పువ్వులంటే అంత సరదా! ఒకటిరెండు రోజులు ముందుగా బయలుదేరివస్తే అందరం కలిసి వెళ్దాము బారసాలకు. నీ క్షేమం వెంటనే రాయగోర్తాను.

ఇట్లు

నీ ప్రియమైన చెల్లెలు శాంత!

* * * *

జీవితేశ్వరి సరస్వతికి!

నేను చాలా కోపంతెచ్చుకొని అసలే నీకు ఉత్తరం రాయకూడదనుకున్నాను. అయితే ఉత్తరమే రాయకపోతే నాకు కోపంవచ్చినట్లు నీకు తెలియడం ఎలాగ?

తీరా ఉత్తరం ఆరంభించి జీవితేశ్వరి అని సంబోధించడంతో సగం కోపం చల్లబడిపోయింది. కోపమయినా, ఎదురుగా మనిషి ఉండి మాటకి మాట అంటూ ఉంటేనేగాని, రాజుకోదు.

సరేగాని, నువ్వింకా రావడానికి ఎంతకాలం పడుతుంది? పెళ్ళికి వెళ్ళి వారంరోజుల్లో వస్తానన్న దానివి, ఇప్పటికి నెల దాటింది. ఎప్పుడు రాదలచు కొన్నదీ ఉత్తరమయినా లేదు, అసలు అక్కడి ఆ హడావిడిలో నేను జ్ఞాపకం ఉన్నానా అని అనుమానం.

నీ దగ్గరనుండిగాని రెండుమూడు రోజుల్లో ఉత్తరం రాకపోతే ఈమారు నేనూ నీతో చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయి కొన్ని నెలలయితేనేగాని తిరిగిరాను.

ఇందిర బాగా ఆడుకుంటుందా? నువ్వు చెప్పిన లెక్క ప్రకారం అయితే ఈపాటికి బంగరడం వచ్చి ఉండాలి.

నేను అట్టే ఎదురుచూడను; నీ యిష్టం అయితే ఉత్తరం రాస్తావు, లేకపోతే లేదు, నిర్బంధించడానికి నే నెవర్ని.

నీవాడు, కృష్ణమూర్తి.

*   *   *   *

సరస్వతీ! మీ అన్నయ్య రాసిన ఉత్తరం అందింది. అందులో రాసినప్రకారం బయలుదేరే మాటయితే ఈ ఆదివారంనాడు బయలుదేరాలి. అంటే నాలుగురోజులే ఉంది.

ఇందాకా ప్రెస్సునుండి తిరిగి వస్తుండగా టెలిగ్రాము వచ్చింది మా బావకు జబ్బుగా ఉంది వెంటనే రావలసిందని. నేను ఇప్పుడు మూడుగంటల బండికి వెళ్తున్నాను. అందుచేత మీరు ఆదివారం నాడు బయలుదేరి, ఇక్కడిదాకా తిన్నగా రాకుండా మా చెల్లెలుగారి ఊళ్ళో దిగితే అక్కడ అవసరముంటే అందరం ఉంటాము. లేకపోతే కలిసి రావచ్చును—టెలిగ్రాంలో కేవలం జబ్బుగా ఉందని మాత్రమే ఉంది. అయినా ఎందుకో చాలా భయంగా ఉంది. అక్కడకు వెళ్ళి పరిస్థితిఅంతా చూసి ధైర్యంగా ఉంటే వైరుచేస్తాను. వీలయితే ఆదివారం దాకా ఎందుకు, ఈలోగానే బయలుదేరకూడదూ? ఓహో, ఇది మీ కందడమే శనివారంనాడు అందుతుంది. ఏమిటో మనస్సు సరిగా పనిచేయడంలేదు. ఇవతల ప్రెస్సులోకూడా ముఖ్యమయిన పనివాళ్లిద్దరు లేరు; చాలా తొందరగా చెయ్యవలసిన పని ఎంతో ఉంది. సరే కానీ ఏంచేస్తాం? ఇది నీకందేలోగానే టెలిగ్రామిస్తానేమో! లేక ఇంట్లో మరెవ్వరూ లేక గాభరాపడి మా చెల్లెలు టెలిగ్రా మిప్పించిందేమో? ఇది అందినతరవాత మరి ఆలస్యం చెయ్యవుకదూ.

నీవాడు కృష్ణమూర్తి.

*   *   *   *

ప్రియమైన బావ సోమయాజులుకు అనేక నమస్కారములు. ఈ రోజునే మా బావగారు ఆరోగ్యస్నానంచేసినారు. రేపు ఉదయం రైలులో బయలుదేరి మేము వెళ్తున్నాము. మా బావగారూ, మా చెల్లెలు శాంత నువ్వు ఆనాటికి సరిగా ధన్వంతరిలాగ అవతరించావంటున్నారు. నిజంకూడా అంతే. ఆవేళగాని నువ్వు వచ్చిఉండకపోతే ఏమయేదో? ఇక్కడ ప్లీడర్లలో మూడువంతులు మంది తమతమ దీర్ఘవ్యాధులను నీచేత నయం చేయించుకోవాలను కొంటున్నారు. నేను వద్దంటున్నా వినకుండా మా బావగారు నీపేర ఈ ఉదయం రెండువందల రూపాయిలు మనియార్డరు కట్టేరు; అది తిరగగొట్టవద్దని నా కోరిక. లేకపోతే ఆయనమనసుకి చాలా కష్టంగా ఉంటుంది—త్వరలో అక్కడికి జవాబు రాస్తావు కదూ!

కృష్ణమూర్తి వ్రాలు.

[సశేషం]